ప్రజాశక్తి
ఆదివారం 01 జూన్ 2025
పేజీలు 8

కర్నూలు నంద్యాల

'గ్రీన్ కో' దౌర్జన్యం

- పొలాలకు దారి లేకుండా కంచె ఏర్పాటు
- పిన్నాపురం రైతులకు తప్పని తిప్పలు
- ఉదయం ఉన్న దారి సాయంత్రానికే మూసివేసిన కంపెనీ నిర్వాహకులు

పొలాల దారికి అడ్డంగా కంచె వేయడంతో ఆగిన రైతు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

పిన్నాపురం గ్రీన్ కో కంపెనీ నిర్వాహకుల ఆగడాలు రోజురోజుకు మితిమీరిపోతున్నాయి. రైతులను అనేక రకాలుగా వేధింపులకు గురి చేస్తున్నారు. పూర్వీకుల కాలం నుండి రైతుల పొలాలకు ఉన్న దారిని మూసివేస్తూ సోలార్ ప్రాజెక్టుకు సంబంధించిన గ్రీన్ కో కంపెనీ నిర్వాహకులు శనివారం ఇనుప ముళ్ల కంచ వేశారు. ఉదయం పొలాలకు వెళ్లిన రైతులు సాయంత్రం అదే దారిలో ఇళ్లకు వెళ్ళడానికి రాగా దారికి ఇనపు ముళ్ల కంచ వేసి ఉండడం చూసి రైతులు అవాక్కయరు. ఉదయం ఉన్న దారి సాయంత్రంకు మూసి వేయడంపై పిన్నాపురం బాధిత రైతులు కంపెనీ యాజమాన్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పొలాలకు వెళ్లడానికి దారి వదలాలని బాధిత రైతులు డిమాండ్ చేశారు. దారికి కంచె వేయడం (మిగతా 3లో..)

కొత్తగా 2319 పింఛన్లు మంజూరు

- కర్నూలులో పింఛన్లను పంపిణిలో మంత్రి టిజి భరత్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు జిల్లాలో కొత్తగా 2319 మంది వితంతవు కేటగిరి కింద పించన్లు మంజురు అయ్యాయని జిల్లా కలెక్టర్ పి రంజీత్‌భాష వెల్లడించారు. ఎన్‌టిఆర్ భరోసా పథకం కింద శనివారం జిల్లా వ్యాప్తంగా పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో మొత్తం 2,37,200 మంది పింఛన్ లబ్దిదారులకు రూ.102.35కోట్ల నిధులను విడుదల చేశారు. జూన్ ఒకటవతేది అదివారం రావడంతో ముందు రోజునే పించన్ల నగదును లబ్ధిదారులకు సచివాలయ సిబ్బంది (మిగతా 3లో..)

పింఛన్ పంపిణీ చేస్తున్న మంత్రి టిజి భరత్

పింఛన్ పంపిణీ చేస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

ఆరోగ్య పరిరక్షణకు యోగా కీలకం

ఆరోగ్య పరిరక్షణకు, ఆధ్యాత్మిక సాధనకు యోగ కీలకమని, ప్రతి ఒక్కరూ యోగా చేసి ఆరోగ్యంగా ఉండాలని కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. శ్రీశైల మహాక్షేత్రంలో నిర్వహించిన యోగాంధ్రను జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి, ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, జెసి సి.విష్ణుచరణ్, ఇఒ ఎం.శ్రీనివాసరావు తదితరులు ప్రారంభించారు. (వార్త 3లో...)

ఉద్యోగ 'ప్రయాణం'లో ఉద్యమ సారథి

- నేడు జె. దివాకర్ ఉద్యోగ విరమణ అభినందన సభ

విద్యార్థి దశ నుంచే ఇతరుల కోసం పనిచేయాలన్న తపన, మెరుగైన సమాజం కోసం సాగుతున్న ఆశయంలో తోడుగా నిలవాలన్న ఆకాంక్షతో జె.దివాకర్ తన ఉద్యోగ ప్రయాణంలో వ్యక్తిగత వృత్తిని చేస్తూనే తోటి ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై గళమెత్తారు. తమ సంస్థ అభివద్ధి, పరిరక్షణ కోసం సాగిన ఉద్యమాల్లో వెన్నుదన్నుగా ఉంటూ నిర్బంధాలను సైతం లెక్కచేయకుండా పోరాడారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ సంఘాన్ని కర్నూలు జిల్లాలో బలోపేతం చేయడానికి అవిశ్రాంతంగా కృషి చేస్తూ, ఆ సంఘంలో సాధారణ కార్యకర్త నుండి రాష్ట్ర స్థాయి నేతగా ఎదిగారు. ఉద్యోగ, కార్మిక సమస్యలపై గళమెత్తిన నేత జూన్ 1న ఉద్యోగ విరమణ పొందుతున్న జె. దివాకర్ ఉద్యోగ ప్రస్థానంపై ప్రజాశక్తి ప్రత్యేక కథనం...

(వార్త 4వ పేజీలో..)

దేశ సమగ్రతను కాపాడదాం : సిపిఎం

ప్రజాశక్తి - ఆదోని

దేశ సమగ్రత పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని సిపిఎం నాయకులు పేర్కొన్నారు. మత సామరస్య, దేశ సమైక్యత, ఉగ్రవాదం నశించి జాతీయ సమైక్యత కాపాడాలని కోరారు. శనివారం పట్టణంలోని సిఐటియు కార్యాలయం నుంచి భీమాస్ సర్కిల్ వరకు సిపిఎం ఆధ్వర్యంలో జాతీయ సమైక్యతా ర్యాలీ నిర్వహించారు. సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్. గోపాల్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కె.వెంకటేశులు, సీనియర్ నాయకులు ఈరన్న, పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, మండల కార్యదర్శి లింగన్న మాట్లాడారు. పహల్గాంలో ఉగ్రదాడుల్లో 26 మంది చనిపోయారని తెలిపారు. దేశ ప్రజలందరూ జాతీయ సమైక్యత కోసం ఉగ్రవాదం తరిమికొట్టాలని కోరారు. తీవ్రవాదానికి వ్యతిరేకంగా, మతసామరస్యం, దేశ సమైక్యత, రాజ్యాంగ రక్షణ కోసం దేశ ప్రజలందరూ పోరాడాలని తెలిపారు. సిపిఎం నాయకులు సి.ముక్కన్న, అజీమ్ ఖాన్, తిప్పన్న, తిక్కన్న, నాగరాజు, వీరేష్, రాజు, నీలకంఠ, వెంకటేష్, మల్లయ్య, నరసప్ప, చాంద్‌బాషా, ఇక్బాల్, శ్రీనివాసులు, గోపాల్ పాల్గొన్నారు.

డిప్యూటీ మేనేజర్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి - ఆస్పరి : ఆస్పరి ఎస్‌బిఐ బ్యాంకులో డిప్యూటీ మేనేజర్‌గా పని చేస్తున్న ఉరుకుందప్పకు మేనేజర్ సచింద్ర బాబు శాలువా, పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. శనివారం మేనేజర్ మాట్లాడారు. బ్యాంకుకు వచ్చిన ఖాతాదారులతో ఉరుకుందప్ప ఆప్యాయతంగా మాట్లాడే వారని తెలిపారు. తోటి ఉద్యోగులతో కలిసి మెలిసి పనులు చేసే వారన్నారు. విధుల పట్ల అంకితభావంతో ఉండేవారని తెలిపారు. 35 ఏళ్ల పాటు వివిధ హోదాలో పని చేస్తూ బ్యాంకు అభివృద్ధికి కృషి చేశారని పేర్కొన్నారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఫీల్డ్ ఆఫీసర్ మద్దిలేటి, శ్యామ్ సుందర్, మేఘానాథ్, గోవిందు, లక్ష్మి కాంత్, మల్లికార్జున నాయక్, దీప్తి, నవీన్ పాల్గొన్నారు.

రూ.4 కోట్లు ఎమ్మెల్యే తెచ్చారా..?

- మెడికల్ ఆఫీసర్ ఏకపక్ష ధోరణి సరికాదు
- కౌన్సిలర్ల మండిపాటు

ప్రజాశక్తి - ఆదోని

పట్టణాభివృద్ధి కోసం ఎమ్మెల్యే పార్థసారథి రూ.4 కోట్ల నిధులు తెచ్చారా అంటూ కౌన్సిలర్లు ప్రశ్నించారు. అలాగే కౌన్సిల్‌ను నిర్లక్ష్యం చేస్తూ ఏకపక్ష ధోరణి అవలంభిస్తున్న మెడికల్ హెల్త్ ఆఫీసర్ సందీప్ వైఖరి మార్చుకోవాలని మండిపడ్డారు. శనివారం ఆదోని మున్సిపల్ కౌన్సిల్ హాలులో ఛైర్మన్ లోకేశ్వరి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఇటీవల కుక్కల సంతానోత్పత్తి నివారణ కేంద్రం ప్రారంభానికి ఛైర్మన్‌కు, కౌన్సిలర్‌కు సమాచారం ఇవ్వకుండా హెల్త్ ఆఫీసర్ నిర్లక్ష్యం చేశారని ఛైర్మన్ లోకేశ్వరికి ఫిర్యాదు చేశారు. మున్సిపాలిటీ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్నామన్న నిజాన్ని తెలుసుకోవాలని, పద్ధతి మార్చుకోకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని కౌన్సిలర్ సందీప్ రెడ్డి పేర్కొన్నారు.

నిజంగా రూ.4 కోట్లు విడుదలయ్యాయా

పట్టణాభివృద్ధికి రూ.4 కోట్లు నిజంగా విడుదలయ్యాయా అనే సందేహం ఉందని, నివృత్తి చేయాలని కౌన్సిలర్ రఘునాథ్ రెడ్డి కౌన్సిల్ దృష్టికి తెచ్చారు. పదే పదే ఎమ్మెల్యే పార్థసారథి మున్సిపల్ కౌన్సిల్‌పై ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. ఆయన నిజంగా నిధులు విడుదల చేయించి ఉంటే వాటి గురించి ప్రజలకు తెలపాలని కమిషనర్ కృష్ణను ప్రశ్నించారు. నిధుల విడుదల గురించి తమ వద్ద సమాచారం లేదని కమిషనర్ కృష్ణ తేల్చి చెప్పారు. ఎమ్మెల్యే ఏ సందర్భంలో ఆ ప్రకటన చేశారో తమతో ఆధారాలు లేవని కౌన్సిల్‌కు వివరించారు. నియోజకవర్గ అభివృద్ధికి వైసిపి కౌన్సిలర్లు అడ్డుపడుతున్నారని చెప్పడం ఎమ్మెల్యే మానుకోవాలని వైసిపి కౌన్సిలర్లు హితవు పలికారు. 16వ వార్డులో వాటర్ పైపులైన్ పనులు నిలుపుదల చేశారని ఆ వార్డు కౌన్సిలర్ హసీనా బేగం అధికారుల దృష్టికి తెచ్చారు. తమ వార్డులో ఒక్క అభివృద్ధి కూడా పని జరగలేదని, ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని నిలదీశారు. 1వ వార్డు కౌన్సిలర్ పార్వతి మాట్లాడుతూ... తమ వార్డులో విద్యుత్ స్తంభాలు అమర్చారే కానీ ఇంతవరకు తీగలు లాగలేదని, త్వరలో పనులు చేయించి విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. విద్యుత్ శాఖ పరిధిలో ఉందని డిప్యూటీ ఇంజినీర్ గోపినాథ్ వివరణ ఇచ్చారు. బక్రీద్ సందర్భంగా పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని కౌన్సిలర్ ఉస్మాన్ కోరారు. 41వ వార్డు కౌన్సిలర్ ఇందు మాట్లాడుతూ... శుక్రవారం పేట సమీపంలో ఉన్న హిందూ శ్మశాన వాటికలో ముళ్లకంపలు తొలగించి అంత్యక్రియల అనంతరం వివరాలు నమోదు చేసేందుకు వ్యక్తిని నియమించాలని కౌన్సిల్ దృష్టికి తెచ్చారు. కౌన్సిలర్ సందీప్ రెడ్డి మాట్లాడుతూ... హరిశ్చంద్ర ఘాట్ పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. అంత్యక్రియల అనంతరం అక్కడ నిలబడేందుకు కూడా సౌకర్యాలు లేకపోవడం సిగ్గుచేటన్నారు. మృతదేహాలను కాల్చే మిషన్‌ను వాడకంలోకి తీసుకురావాలని, కౌన్సిలర్లు అందరూ సహకరిస్తామని కమిషనర్‌కు ఆయన హామీ ఇచ్చారు. తమ వార్డులో నీటి సమస్య ఉందని, వాటర్ ట్యాంకులు నిర్మించాలని కౌన్సిలర్ ఫయాజ్ కోరారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ నరసింహులు మాట్లాడుతూ... అధికారులు ఏకపక్ష ధోరణి అవలంభిస్తున్నారని, ఇక్కడ కౌన్సిల్‌దే తుది తీర్పు అన్నది గ్రహించాలని తెలిపారు. వార్డులో పర్యటించే సమయంలో సంస్థలకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఆర్ట్స్ కళాశాల రోడ్డు మధ్యలో డివైడర్ల నిర్మాణం చేపట్టి ప్రమాదాలు జరగకుండా చూడాలని కౌన్సిలర్ బాలాజీ కోరారు. ఆదోని జై హింద్ బోర్డు శిథిలావస్థకు చేరిందని, మరమ్మతులు చేపట్టి వెల్కమ్ బోర్డు ఏర్పాటు చేయాలని కౌన్సిలర్ చలపతి తెలిపారు. హనుమాన్ నగర్‌లోని వంక ఎత్తు పెంచాలని కౌన్సిలర్ లక్ష్మి కోరారు. కౌన్సిలర్లు తెలిపిన విషయాలను అధికారులు గ్రహించి పరిష్కారమయ్యేలా చూడాలని ఛైర్మన్ లోకేశ్వరి ఆదేశించారు. మాజీ ఛైర్మన్ బోయ శాంత, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, డిప్యూటీ ఇంజినీర్లు చలపతి రెడ్డి, రామమూర్తి, రంజిత్, కౌన్సిలర్లు అశోక్, చిన్న, రాజేశ్వర్ రెడ్డి, వసీం, ఇంతియాజ్, లక్ష్మి, లలితమ్మ, భారతి, రాజేశ్వరి, సురేష్, పద్మ, కీర్తన, పద్మావతి, కృష్ణవేణి ఉన్నారు.

మెడికల్ ఆఫీసర్‌ను నిలదీస్తున్న కౌన్సిలర్ సందీప్ రెడ్డి

శ్మశాన వాటిక కోసం ఇరు వర్గాల మధ్య వివాదం

- ఎటూ తేల్చకపోవడంపై మహిళల తిరుగుబాటు
- రెవెన్యూ, పోలీసుల నిలదీత
- వాగ్వాదాన్ని వీడియో తీస్తున్న వ్యక్తిపై దాడి
- ఎస్సీల ఇంటి ముందు పూడ్చడమేంటని రోడ్డుపై నిరసన

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని చెట్నిహల్లి గ్రామంలో శ్మశాన వాటిక విషయంలో ఇరు వర్గాల మధ్య వివాదం మళ్లీ చెలరేగింది. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కురువ రాముడు అంత్యక్రియల కోసం శ్మశాన వాటికలో గుంతను తవ్వేందుకు శనివారం బీసీ వర్గానికి చెందిన వారు వెళ్లారు. ఎస్సీ కుటుంబాల ఇంటి ముందు మృతదేహాలను పూడ్చడం ఏంటని ఎస్సీలు జాతీయ రహదారిపై నిరసన చేపట్టారు. విషయం తెలుసుకున్న సిఐ రామాంజులు అక్కడకు చేరుకుని రెవెన్యూ అధికారుల చొరవతో కాస్త దూరంగా ఖననం చేస్తారని చెప్పడంతో శాంతించారు. మూడు నెలల క్రితం శ్మశాన స్థలం విషయంలో బీసీ వర్గానికి చెందిన 50 మందిపై కేసులు నమోదు చేశారు. ఎస్సీలపై కూడా కేసు నమోదు చేశారు. ఇటు తహశీల్దార్‌కు అటు సబ్ కలెక్టర్, కలెక్టర్ దృష్టికి వెళ్లినా శ్మశాన వాటిక విషయం ఎటూ తేల్చకుండా జాప్యం చేస్తున్నారు. గ్రామంలో ఎవరు చనిపోయినా మళ్లీ ఇదే సమస్య తలెత్తుతోంది. మరోవైపు తహశీల్దార్ ఎస్.రవి శ్మశాన స్థలాన్ని మరోచోటకు మార్చేందుకు రికార్డులను సిద్ధం చేసినట్లు సమాచారం. అక్కడికి చేరుకునేందుకు సరైన రోడ్డు లేకపోవడంతో పిఆర్ ఎఇ ద్వారా ఎన్‌ఆర్‌ఇజిఎస్ కింద రోడ్డు వేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన మహిళలు ఏళ్ల తరబడి శ్మశాన స్థలం ఇక్కడే ఉందని, ఇప్పుడు ఎస్సీలు అడ్డగించేందుకు అధికారం ఎవరిచ్చారని విఆర్‌ఒ భీమయ్యను, మాధవరం ఎస్ఐ విజయ్ కుమార్‌ను నిలదీశారు. వాగ్వాదాన్ని మొబైల్‌లో చిత్రీకరిస్తున్న ఎస్సీ వర్గానికి చెందిన యువకుని మహిళలు చితకబాదారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి యువకుని తప్పించారు. సమస్యను పరిష్కరించాలని అడిగిన పాపానికి తమపై కేసులు పెట్టి కోర్టుల చుట్టూ తిప్పుతున్నారని, అందుకే వివాదానికి దూరంగా ఉన్నామని, మహిళలే పూనుకొని అధికారులను నిలదీసినట్లు గ్రామస్తులు తెలిపారు. శ్మశాన స్థలం సమస్యపై కొనసాగుతున్న వివాదానికి శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇరువర్గాలకు సర్ది చెబుతున్న పోలీసు అధికారులు

ఎమ్మెల్యేకు మున్సిపల్ అధికారుల సన్మానం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరును గ్రేడ్-1 నుంచి స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా అప్ గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం జిఒ జారీ చేయడం పట్ల మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర్ రెడ్డిని వారి స్వగృహంలో కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సన్మానించారు. కూటమి ప్రభుత్వం ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తోందని, మరింత అంకితభావంతో పనిచేయాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు.

పండగలా రేషన్ బియ్యం పంపిణీ : తహశీల్దార్

గోనెగండ్ల : డీలర్లతో మాట్లాడుతున్న తహశీల్దార్

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని అన్ని గ్రామాల్లోనూ రేషన్ బియ్యం పంపిణీని డీలర్లు పండగ వాతావరణంలో ప్రారంభించాలని తహశీల్దార్ కుమారస్వామి కోరారు. శనివారం తహశీల్దార్ కార్యాలయంలో మండలంలోని అన్ని గ్రామాల రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడారు. నేటి నుంచి రేషన్ పంపిణీ చేసే ఎమ్‌డియు వాహనాలను ప్రభుత్వం రద్దు చేసిందని తెలిపారు. ఇకపై ప్రతి నెలా 1-15 వరకు ఉదయం, సాయంత్రం నిర్దేశించిన సమయాల్లో రేషన్ దుకాణాల్లోనే కార్డుదారులకు రేషన్ పంపిణీ చేయాలని డీలర్లను ఆదేశించారు. ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులూ రాకుండా చూసుకోవాలని, ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

హాలహర్వి : మండలంలోని అన్ని గ్రామాల్లో రేషన్ షాపుల దగ్గరే నిత్యావసర సరుకుల పంపిణీ జరుగుతుందని ఇన్‌ఛార్జ్ తహశీల్దార్ లక్ష్మి తెలిపారు. ప్రతి రేషన్ డీలర్ ఈ-పాస్ మిషన్ లాగిన్‌లో లాగిన్ అయి సరుకులు అందించాలని తెలిపారు. విఆర్‌ఒలు అందుబాటులో ఉండి డీలర్లు సరిగా ఇస్తున్నారో, లేదో పర్యవేక్షించాలని తెలిపారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

ప్రజాశక్తి - పగిడ్యాల : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ప్రతిరోజు గ్రంథాలనికొచ్చి వివిధ రకాల పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ కె. మద్దమ్మ విద్యార్థులకు సూచించారు. పగిడ్యాల గ్రంథాలయంలో వేసవి పునశ్చరణలో భాగంగా శనివారం ఆమె మాట్లాడారు. చదువే గౌరవాన్ని ఇస్తుందని, ప్రతి ఒక్కరూ మంచిగా చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. ట్రాక్ట్ ఫుల్ ఫిషర్ మాన్ ఇంగ్లీష్ కథనం విద్యార్థులచే చదివించి వాటి అర్థాన్ని వివరించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్‌సిపి అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - ఆత్మకూరు : వైఎస్ఆర్‌సిపి పార్టీ అభివృద్ధి కోసం మరింత కృషి చేస్తానని ఆ పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శిగా ఎన్నికైన కె. విజయ్ చౌదరి అన్నారు. మాజీ సిఎం వైఎస్. జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి సహకారంతో వైఎస్ఆర్‌సిపి రాష్ట్ర యువజన విభాగం సెక్రటరీగా నియమితులైన కౌన్సిలర్ విజయ్ చౌదరి శనివారం పట్టణ వైఎస్ఆర్‌సిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి, శిల్పా భువనేశ్వర్ రెడ్డిలను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.



తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి : ఎస్ఐ

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్ : వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించి రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలను కాపాడుకోవాలని ఎస్.ఐ జగన్మోమన్ పేర్కొన్నారు. బండి ఆత్మకూరు అటవీ శాఖ కార్యాలయం వద్ద నంద్యాల ఆత్మకూరు రహదారిలో వాహదారులకు హెల్మెట్, ట్రాఫిక్ గురించి శనివారం అవగాహన కల్పించారు. నంద్యాల ఆత్మకూరు ప్రధాన రహదారిలో వాహనాల రద్దీ ఎక్కువైందని ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రయాణాలు చేయాలన్నారు. ప్రతి వాహనదారుడు తన కుటుంబాన్ని తల్లిదండ్రులను గుర్తు చేసుకోవాలని, మద్యం సేవించి వాహనాలు నడపొద్దన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి

ప్రజాశక్తి - కౌతాళం : నిత్యావసర సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని తహశీల్దార్ రజనీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం తహశీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రేషన్ పంపిణీ పండగ వాతావరణంలో లబ్ధిదారులకు పంపిణీ చేయాలని కోరారు. ప్రజలకు అందుబాటులో ఉండి సకాలంలో బియ్యం పంపిణీ చేయాలని తెలిపారు. పంపిణీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వైసిపి అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - చిప్పగిరి : వైసిపి అభివృద్ధికి కృషి చేస్తామని వైసిపి రాష్ట్ర యువజన విభాగం సెక్రటరీ బి.చంద్రశేఖర్ తెలిపారు. వైసిపి అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, పెద్దలు, అధిష్టానం ఆదేశాల మేరకు బుసినే చంద్రశేఖర్‌ను రాష్ట్ర యువజన విభాగ సెక్రటరీగా నియమించినందుకు శనివారం ఆయన కృతజ్ఞతలు తెలిపారు. చిప్పగిరిలోని వారి స్వగృహంలో ఆయన మాట్లాడారు. పార్టీ తనను గుర్తించి రాష్ట్ర విభాగంలో యువతకు ప్రాధాన్యత ఇచ్చి ఈ పదవిని కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ సిఎం జగన్ మోహన్ రెడ్డి పేదల కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని, వారిని స్ఫూర్తిగా తీసుకొని నిరంతరం పని చేస్తామన్నారు.

సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం : మంత్రి బీసీ

ప్రజాశక్తి - బనగానపల్లె

సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రోడ్లు , భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని పలుకూరు గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్డీయే కూటమి ప్రభుత్వం ప్రజల శ్రేయస్సు, సంక్షేమం కాంక్షించే ప్రభుత్వం అన్నారు. 1వ తేదీ ఆదివారం కావడంతో ముఖ్యమంత్రి సూచన మేరకు ఒక రోజు ముందస్తుగానే లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. జూన్ నెల నుంచి కొత్తగా దాదాపు 71 వేల మంది లబ్ధిదారులకు స్పౌజ్ పింఛన్లు కూటమి ప్రభుత్వం అందజేయనున్నట్లు తెలిపారు. ఒకేసారి 3 నెలల పింఛన్ తీసుకునే వెసులుబాటు లబ్ధిదారులకు తమ ప్రభుత్వం కల్పించినట్లు తెలిపారు. త్వరలో అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలను అమలు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అంబాల రామకృష్ణారెడ్డి, టిడిపి నాయకులు అంబాల ప్రభాకర్ రెడ్డి, ఎంపీడీవో బివి రమణ ఈఓఆర్డి సతీష్ కుమార్ రెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి బాలాంజనేయులు, నాయకులు చల్లా మదిలేటి, వల్లెపు శంకర్, రామపుల్లయ్య యాదవ్, నాగేశ్వరరావు, రమేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్లను పంపిణీ చేస్తున్న మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

'గ్రీన్ కో' దౌర్జన్యం

కంచె వేయడంతో దిక్కుతోచక ఆగి ఉన్న రైతులు, కూలీలు

మొదటి పేజీ తరువాయి.. ద్వారా తమ పొలాలకు వెళ్ళడానికి ఇబ్బంది అవుతుందని రైతులు పేర్కొంటున్నారు. ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు జోక్యం చేసుకొని పొలాల దారికి అడ్డంగా వేసిన ఇనుప కంచెను తొలగించాలని, గ్రీన్ కో కంపెనీ నిర్వాహకుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని పిన్నాపురం రైతులు కోరుతున్నారు..

ఇనుప ముళ్ల కంచెను తొలగించాలి

- కలెక్టర్, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకోవాలి : ఏపి రైతు సంఘం

పిన్నాపురం రైతుల పొలాలకు ఉన్న రస్తా విషయంలో జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, మంత్రులు జోక్యం చేసుకుని రైతులకు న్యాయం చేయాలని ఏపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏ.రాజశేఖర్ శనివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. పిన్నాపురంలో రైతుల పొలాలను గ్రీన్ కో కంపెనీ బలవంతంగా లాగేసుకుంటుందని, భూ సేకరణ చేసినదాని కంటే ఎక్కువగా రైతుల నుండి తీసుకుంటున్నారని ఆరోపించారు. ఎన్నో ఏళ్లుగా రైతులు తమ పొలాలకు అదే రస్తా వెంబడి పోతున్నారని, అయితే శనివారం పొలాలకు పోయే దారిని గ్రీన్ కో కంపెనీ యాజమాన్యం ముళ్ల కంచె వేయడం దారుణమన్నారు. రైతులను ఇబ్బందులకు గురి చేసే చర్యలను కంపెనీ యాజమాన్యం మానుకోవాలని హెచ్చరించారు. తక్షణమే జిల్లా కలెక్టర్, జిల్లా ప్రజా ప్రతినిధులు, స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకొని పొలాలకు వెళ్లే దారికి అడ్డంగా వేసిన కంచెను తొలగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆరోగ్య పరిరక్షణకు యోగా కీలకం

- నంద్యాల జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్ట్

ఆరోగ్య పరిరక్షణకు, ఆధ్యాత్మిక సాధనకు యోగ కీలకమని, ప్రతి ఒక్కరూ యోగా చేసి ఆరోగ్యంగా ఉండాలని కలెక్టర్ రాజకుమారి గణియా పేర్కొన్నారు. శ్రీశైల మహాక్షేత్రంలోని గంగాధర మండపం నుండి నంది సర్కిల్ వరకు 1500 మందిచే నిర్వహించిన యోగాంధ్రను జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్, ఇఒ ఎం. శ్రీనివాసరావు తదితరులు శనివారం జ్యోతి ప్రజ్వలన చేసిన ప్రారంభించారు. ప్రముఖ యోగా గురువు గంధవళ్ళ బాలసుబ్రహ్మణ్యం యోగాసనాలను చేయించారు. ప్రముఖ సంస్కృత పండితులు డాక్టర్ దీవి హయగ్రీవాచార్యులు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశానుసారం 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మే 21 నుంచి జూన్ 21 వరకు జిల్లాలోని ఐదు పర్యాటక ప్రదేశాల్లో యోగాంధ్రను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అలాగే జూన్ 7న మహానంది దేవస్థానంలో, 13న బెలూంగుహలు, 18న అహోబిలం, 20న పచ్చర్ల జంగిల్ క్యాంపులో యోగ కార్యక్రమాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ సిఎం ఆదేశాలు, కలెక్టర్ సూచనల మేరకు శ్రీశైల క్షేత్రంలో యోగాంధ్రను విజయవంతం చేశామన్నారు. యోగాచార్యులు 1500 మంది అభ్యాసకులకు చక్కగా యోగా నేర్పించారన్నారు. జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్ మాట్లాడుతూ యోగాలో నిర్వహించే ప్రక్రియను అనుసరించాలని సూచించారు. జూన్ 21న నిర్వహించే అంతర్జాతీయ యోగాదినోత్సవానికి జిల్లా తరుపున అత్యధిక మంది యోగాభ్యసనాలు చేసేందుకు అన్ని స్థాయిల్లో శిక్షణ ఇస్తున్నామని వివరించారు. ఇఒ ఎం. శ్రీనివాసరావు మాట్లాడుతూ పర్యాటక ప్రదేశాల్లో మొదట యోగాంధ్రను శ్రీశైల దేవస్థానంలో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. యోగా గురువు గంధవళ్ళ బాలసుబ్రహ్మణ్యం ప్రతి ఆసనానికి వివరణ ఇస్తూ యోగాపరమైన అంశాలను ఆధునిక వైద్య విజ్ఞానంతో అనుసంధానం చేస్తూ ఆయా విశేషాలను వివరించారు. అనంతరం పలు యోగాసనాలను వేయించారు. కార్యక్రమంలో పలువురు జిల్లా అధికారులు, దేవస్థానం అధికారులు, సిబ్బంది, శివసేవకులు, స్థానిక చెంచు గిరిజనులు, యాత్రికులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపిడిఒ మహబూబ్ ఖాన్ సేవలు అభినందనీయం : ఎంపిపి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డ ఎంపిడివో మహబూబ్ ఖాన్ సేవలు అభినందనీయమని ఎంపిపి గజ్జల రాఘవేంద్ర రెడ్డి అన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపిడివో మహబూబ్ ఖాన్ స్వచ్ఛంద ఉద్యోగ విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ఎంపీడీవోగా ఆయన ప్రజలకు చక్కని సేవలు అందించారన్నారు. గ్రామాలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందరితో కలుపుకోలుగా ఉంటూ గ్రామాలలో అభివృద్ధి పనులు చేయించారన్నారు. ప్రతి ఉద్యోగికి విరమణ తప్పనిసరి అన్నారు. ఆయన శేష జీవితం ఆనందంగా సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నానన్నారు. విరమణ పొందిన ఎంపీడీవో మహబూబ్ ఖాన్ మాట్లాడుతూ సర్వీస్ కమిషన్ ద్వారా తాను పంచాయతీరాజ్ శాఖలోకి ఉద్యోగిగా వచ్చానని, టైపిస్టుగా, జూనియర్ అసిస్టెంట్గా, ఈవోఆర్డిగా, ఎంపీడీవో గా వివిధ హోదాల్లో పని చేశానన్నారు. విధి నిర్వహణ చక్కటి సంతృప్తి ఇచ్చిందన్నారు. అందరి సహకారంతోనే తాను ఎంపీడీవోగా మంచి సేవలు అందించినట్లు తెలిపారు. అనంతరం ఆయనను ఎంపీపీ గజ్జల రాఘవేంద్ర రెడ్డి తోపాటు ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, జాతీయ ఉపాధి హామీ పథకం సిబ్బంది, ఆర్డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్, ఎస్ఆర్ఇఎస్, పంచాయతీ కార్యదర్శులు, ఆల్ మేవా ఉద్యోగ సంఘ నాయకులు తదితరులు ఎంపీడీవో దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహానంది ఎంపీడీవో మహబూబ్ దౌలా, నంద్యాల డ్వామా ఏవో హనీఫ్ ఖాన్, ఇంచార్జ్ ఈఓఆర్డి అశ్విని కుమార్, ఆళ్లగడ్డ ఎంపీడీవో కార్యాలయ ఏవో వెంకటసుబ్బయ్య, ఎంఈఓ శోభా వివేకావతి, నంద్యాల ఏపిఒ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

విరమణఎంపీడీవో దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

అధిక ఫీజులు వసూలు చేస్తున్న

కళాశాలలపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - నంద్యాల

జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలు విచ్చలవిడిగా విద్యార్థుల తల్లిదండ్రుల నుండి లక్షలు రూపాయలు అక్రమంగా ఫీజులు వసూలు చేస్తున్నాయని, కళాశాలలపైన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం ఆర్ఐఒ శంకర్ నాయక్కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఆర్ నాయక్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలు ఇంటర్ బోర్డు నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థుల తల్లి తండ్రుల నుండి ఫీజులు వసూలు చేస్తున్నారని, ఎంసెట్, నీట్, జెఈఈలకు అనుమతి లేకున్నా ఐసీలు, ఒలంపియాడ్, సీబీఎస్ఇ అంటూ మోసం చేస్తున్నారని అన్నారు. అటస్థలం లేకుండా, సరైన విద్యా అర్హత లేని వారితో విద్యను బోధిస్తున్న కళాశాలలు జిల్లా వ్యాప్తంగా ఉన్నాయన్నారు. ఇంటర్ బోర్డు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న కళాశాలలను గుర్తించి కళాశాల గుర్తింపు రద్దు చెయ్యాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సందీప్, సాయి, జోషఫ్, రాజేష్, రోహిత్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

వినతి ఇస్తున్న నాయకులు

కొత్తగా 2319 పింఛన్లు మంజూరు

మొదటి పేజీ తరువాయి.. ద్వారా పంపిణీ చేశారు. కర్నూలు నగరంలోని హమీద్ హైదర్‌ఖాన్ నగర్‌లో మంత్రి టిజి భరత్, దేవనగర్ ప్రాంతంలో జిల్లా కలెక్టర్ పి రంజిత్‌బాష పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. మంత్రి టిజి భరత్ మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులందరికి పింఛన్ అందజేయడం జరుగుతుందన్నారు. కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తులను తీసుకుంటున్నామని తెలిపారు. పింఛన్ పొందుతున్న లబ్ధిదారులతో మంత్రి, జిల్లా కలెక్టర్ ముచ్చటించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

మంత్రి మాట్లాడుతూ 48వ వార్డు అమీర్ హైదర్‌నగర్‌లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఎన్నికల ప్రచారంలో హామీఇచ్చామని, ఒక్కొక్కటిగా తాము ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని తెలిపారు. ప్రభుత్వానికి ఆదాయం పెంచి.. ఎన్‌డిఎ ఇచ్చిన హామీలన్నీ ముఖ్యమంత్రి చంద్రబాబు నెరవేర్చుస్తారని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు, డిఆర్‌డిఎ పిడి రమణారెడ్డి, కర్నూలు ఆర్‌డిఒ సందీప్ కుమార్, రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు నూరి, మన్సూర్ అలీ ఖాన్, కార్పొరేటర్ పరమేష్, వార్డు నాయకులు దేవ, బూత్ ఇన్చార్జీలు తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డు టీచర్‌కు ఐఏఎస్ అధికారి సన్మానం

ప్రజాశక్తి - సంజామల

తనకు చదువు చెప్పి, ఉద్యోగ విరమణ పొందిన టీచర్ ఎం.పుల్లయ్యను రాష్ట్ర కార్మిక శాఖ అదనపు కార్యదర్శి, ఐఏఎస్ అధికారి గంధం చంద్రుడు శనివారం ఘనంగా సన్మానించారు. మండలంలోని ఆల్వకొండ గ్రామంలో జెడ్పిహెచ్ఎస్ స్కూల్లో పని చేస్తున్న ఎం.పుల్లయ్య ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు ఉపాధ్యాయులు సన్మానించారు.

గురువును సన్మానిస్తున్న ఐఏఎస్ అధికారి గంధం చంద్రుడు

వైభవంగా ఆంజనేయ స్వామి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ట

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

కొలిమిగుండ్ల మండల పరిధిలోని బి.ఉప్పలూరు గ్రామంలో అభయ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవం వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు ఆలూరి రాఘవేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రాచరణలతో అభయ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవం సందర్భంగా గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. గ్రామంలో అన్నదానం ఏర్పాటు చేశారు. సందర్భంగా వివిధ రాజకీయ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పూజా కార్యక్రమంలో పాల్గొన్న బీసీ ఇందిర రెడ్డి



పూజా కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

విగ్రహ ప్రతిష్ట వేడుకలో బీసీ ఇందిర రెడ్డి

అభయ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవం వేడుకలో రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిర రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. టిడిపి సీనియర్ నాయకుడు ఐవి.పక్కీరా రెడ్డి, ఉగ్రసేన రెడ్డి, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ట వేడుకలో మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

అభయ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవం వేడుకలో మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజలు చేసి నిర్వహించారు. కార్యక్రమంలో కాటసాని తిరుపాలరెడ్డి, కాటసాని ప్రసాద్ రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు లాయర్ మహేశ్వర్ రెడ్డి, హనుమంతగుండం సింగల్ విండో మాజీ అధ్యక్షులు సత్రిగాడు రామిరెడ్డి, వైసిపి నాయకులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

CHANGE OF NAME
I, PYREDDY KALAVATHAMMA (Old Name) R/o.Flat No:34, B. Block, Skanda Hills, Dinnedevarapadu, kurnool dist, AP., have changed my name as PYREDDY SHASHIKALAWATHAMMA (New Name) W/o.PYREDDY NAGESWARA REDDY

ప్రజాశక్తి
www.prajasakti.com
కర్నూలు, నంద్యాల
ఆదివారం 01 జూన్ 2025

ఉద్యోగ 'ప్రయాణం'లో ఉద్యమ సారథి

- నేడు జె.దివాకర్ ఉద్యోగ విరమణ

విద్యార్థి దశ నుంచే ఇతరుల కోసం పనిచేయాలన్న తపన, మెరుగైన సమాజం కోసం సాగుతున్న ఉద్యమంలో తోడుగా నిలవాలన్న ఆకాంక్షతో జె.దివాకర్ తన ఉద్యోగ ప్రయాణంలో వృత్తిగత వృత్తిని చేస్తూనే తోటి ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై గళమెత్తారు. తమ సంస్థ అభివృద్ధి, పరిరక్షణ కోసం సాగిన ఉద్యమాల్లో వెన్నుదన్నుగా ఉంటూ నిర్బంధాలను సైతం లెక్కచేయకుండా పోరాడారు. ఎస్‌డబ్ల్యుఎఫ్ సంఘాన్ని కర్నూలు జిల్లాలో బలోపేతం చేయడానికి అవిశ్రాంతంగా కృషి చేస్తూ, ఆ సంఘంలో సాధారణ కార్యకర్త నుండి రాష్ట్ర స్థాయి నేతగా ఎదిగారు. ఉద్యోగ, కార్మిక సమస్యలపై గళమెత్తిన నేత జూన్1న ఉద్యోగ విరమణ పొందుతున్న జె.దివాకర్ ఉద్యోగ ప్రస్థానంపై ప్రజాశక్తి ప్రత్యేక కథనం...

ఆయన 39 సంవత్సరాల 2 నెలల 7 రోజుల ఉద్యోగ జీవితంలో కండక్టర్ నుండి సూపరింటెండెంట్ (ఫైనాన్స్)గా బాధ్యతలు నిర్వర్తించారు. జె.దివాకర్, ఉద్యోగ విరమణ పొందుతున్నప్పటికీ ఉద్యమ విరమణ లేదని స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కోశాధికారిగా ఆర్‌టిసి సూపరింటెండెంట్ (ఫైనాన్స్)గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా (ప్రస్తుత నంద్యాల జిల్లా) పాములపాడు మండలం లింగాల గ్రామంలో 1963లో జల్లి నారాయణ, జల్లి లక్ష్మీదేవమ్మ దంపతులకు జె.దివాకర్ జన్మించారు. ప్రాథమిక విద్యాభ్యాసం సొంత గ్రామంలో, ఆ తర్వాత పాములపాడు, బ్రాహ్మణకొట్కూరు లో సాగింది. ఇంటర్ నందికొట్కూరులో, డిగ్రీ వెలుగోడులోని ఎస్ఎన్ఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో పూర్తి చేశారు. ఇంటర్ చదువుతున్నప్పుడే ఎస్ఎఫ్ఐ పట్ల ఆకర్షితులై అందులో చేరి జిల్లా కమిటీకి ఎన్నికయ్యారు. ఆ తర్వాత డిగ్రీ చదువుతూనే ఎస్ఎఫ్ఐ ఆత్మకూరు తాలూకా కార్యదర్శిగా, ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులుగా 1981 నుండి 1984 వరకు పనిచేశారు. విద్యార్థి నేతగా ఉంటూ విద్యార్థులు ఎదుర్కొంటున్న ట్యూషన్ ఫీజులు, హాస్టల్ సమస్యలు, మెస్ చార్జీలు వంటి సమస్యలపై పోరాటాలు నిర్వహించారు. 1982లో వెలుగోడు కళాశాల ఎన్నికల్లో సైద్ధాంతికంగా, ధన బలాన్ని ఎదుర్కొని ఎబివిపిని ఓడించి ఎస్ఎఫ్ఐ విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించారు.

ఉద్యోగ ప్రస్థానం:1986లో ఆర్‌టిసి కండక్టర్‌గా తాత్కాలిక ఉద్యోగిగా బనగానపల్లె డిపోలో ఆయన ఉద్యోగ ప్రస్థానం మొదలైంది. 1987లో రెగ్యులర్ ఉద్యోగిగా మారారు. 1989 జూన్ లో జూనియర్ అసిస్టెంట్ ఫైనాన్స్‌గా కడపలో పదోన్నతి పొందారు. అక్కడి నుండి 1989 నుండి 2006 వరకు కర్నూలు ఒకటి, రెండు డిపోల్లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేశారు. 2006లో సీనియర్ అసిస్టెంట్ గాను, 2011లో మైదుకూరులో డిప్యూటీ సూపరింటెండెంట్ ఫైనాన్స్ పదోన్నతి పొందారు. 2012 ఫిబ్రవరి నుండి హైదరాబాద్ బస్సు భవన్‌లో పని చేయగా, 2016లో సూపరింటెండెంట్ ఫైనాన్స్‌గా విజయవాడలో పదోన్నతి పొంది నేటి వరకు ఆ ఉద్యోగంలో కొనసాగుతున్నారు. 2016లో నిర్వహించిన కృష్ణ పుష్కరాల సందర్భంగా మంచి కృషికి గాను బెస్ట్ పర్ఫామెన్స్ ప్రశంసా పత్రాన్ని ముఖ్యమంత్రి నుండి అందుకున్నారు. 2025 రిపబ్లిక్ డే సందర్భంగా ఉత్తమ సేవలగాను (ఆడిట్ విభాగం) ఆర్‌టిసి ఎండి ద్వారకా తిరుమల రావుతో క్యాష్ అవార్డు, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఉద్యోగిగా తన తోటి ఉద్యోగ, కార్మికులకు వేతనాలు, అరియర్స్, ఇంక్రిమెంట్స్ విషయంలో సహాయ సహకారాలు అందించడం తన ఉద్యోగంలో సంతృప్తినిచ్చిందని ఆయన తెలిపారు.



ఉద్యమ ప్రస్థానం: విద్యార్థి నేతగా నేర్చుకున్న అనుభవాలతో ఆర్టీసీ ఉద్యోగంలో చేరగానే స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ లో చేరి తన తోటి ఉద్యోగ, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై అవిశ్రాంత పోరాటాలు నిర్వహించారు. 1994 నుండి 2002 వరకు ఎస్‌డబ్ల్యుఎఫ్ రీజినల్ కార్యదర్శి (కర్నూలు ఉమ్మడి జిల్లా కార్యదర్శి) గాను, 2002 నుంచి 2014 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు. రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2014 నుండి నేటి వరకు ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్రకోశాధికారిగా, ఆర్‌టిసి వర్కర్స్ మాసపత్రిక ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. 2002 నుండి 2012 వరకు సిఐటియు కర్నూలు జిల్లా కోశాధికారిగా కొనసాగారు. 2002-2007 రెండు దఫాలుగా కర్నూలు 2 డిపో నుండి కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీకి ప్రతినిధిగా జరిగిన ఎన్నికల్లో రాష్ట్రస్థాయి రికార్డు మెజార్టీతో గెలిచారు. 2012 వరకు ప్రతినిధిగా పనిచేశారు. ఆర్‌టిసి పరిరక్షణ, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 2005లో ఎస్‌డబ్ల్యుఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన తొమ్మిది రోజుల నిరవధిక నిరాహార దీక్షలో రాయలసీమ నుండి తను ప్రాతినిధ్యం వహించి ఆర్.లక్ష్మయ్య నాయకత్వంలో హైదరాబాద్‌లో దీక్షకు కూర్చోవడం మరువలేనిదని ఆయన అంటారు. ఈ సందర్భంగా ఆర్‌టిసిపై పనుల భారం తగ్గడం, ప్రైవేటీకరణ చర్యలు ఆగడం వంటివి జరిగాయని, ఈ దీక్షలను అప్పటి రవాణా శాఖ మంత్రి సంతోష్ రెడ్డి విరమింపజేశారని, ఆ పోరాటానికి కర్నూలు ఎమ్మెల్యే గఫూర్ అందించిన సహకారం మరువలేనిదని ఆయన పేర్కొన్నారు. 2001లో ఆర్‌టిసిలో జరిగిన 24 రోజుల చారిత్రాత్మక సమ్మెలో కర్నూలు జిల్లా కార్యదర్శిగా ఉంటూ లాఠీ చార్జీలు, అరెస్టులను ఎదుర్కొని సమ్మె విజయవంతం కోసం కృషి చేయడం, మద్దతుగా ఉన్న సిఐటియు ప్రదర్శనపై లాఠీచార్జ్, 30 మంది సిఐటియు కార్యకర్తలను 34 రోజుల పాటు కడప సెంట్రల్ జైల్లో పెట్టడం వంటి పోరాటాలు కీలకమైనవని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ పోరాట ఫలితంగా అనేకమంది ఆర్‌టిసి కార్మికులు, ఉద్యోగులు ఎస్‌డబ్ల్యుఎఫ్ పట్ల ఆకర్షితులై సభ్యులుగా చేరి జిల్లా వ్యాప్తంగా అన్ని డిపోల విస్తరణకు దోహదపడింది. 2002 సెప్టెంబర్‌లో ఎస్‌డబ్ల్యుఎఫ్ ఐదవ రాష్ట్ర మహాసభలు కర్నూలు జిల్లా కేంద్రంగా ఉండి విజయవంతంగా నిర్వహించడంలో కీలక పాత్ర వహించారు. 1996లో కర్నూలు 1, 2 డిపో కార్మికులకు సిసిఎ ఇవ్వాలని పోరాడి విజయం సాధించి 1500 మందికి అరియర్స్‌తో సహా సాధించి పెట్టడం, 1994-95లో బోగస్ లైసెన్స్ పేరుతో డ్రైవర్స్‌ను నిర్దాక్షిణ్యంగా ఉద్యోగం నుంచి తొలగిస్తే సంవత్సరం పాటు సుదీర్ఘ కాలంగా పోరాడి 210 మందికి ఉద్యోగాలు తిరిగి ఇప్పించడం, 1997లో మొట్టమొదటిగా కర్నూలు నుండి హైదరాబాద్ బస్సు సర్వీస్ లను మాన్ సర్వీస్‌గా మార్చాలన్న యాజమాన్య నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కర్నూలులో ఎస్‌డబ్ల్యుఎఫ్ చొరవతో ఐక్య పోరాటం ద్వారా ఆరు రోజులపాటు సమ్మె చేసి రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించాలన్న ఆలోచనను విరమించుకునేలా చేసిన పోరాటం 2003లో ఆర్‌టిసి ఆఫీసులలో పనిచేసే స్వీపర్స్‌ను గ్యారేజీ శ్రామికులుగా మార్చి పంపడానికి వ్యతిరేకంగా పోరాడి లీగల్ మద్దతుతో వారిని అదే స్థానంలో కొనసాగింప చేసిన పోరాటం. జిల్లాలో ఆర్టీసీ అన్ని యూనియన్లను ఐక్య పోరాటంలో కలిసి వచ్చేలా చేసిన కృషి మరిచిపోలేని ఘటనలని ఆయన తెలిపారు. ఆర్‌టిసి కార్మికుల సమస్యలే కాక అన్ని రంగాల కార్మికుల సమస్యలపై జరిగిన పోరాటాలలో ముందుండి నడిచారాయన. హర్షవర్ధన్, విష్ణువర్ధన్ ఇద్దరు సంతానం కాగా ఇద్దరు మంచి చదువులు చదివి ఉన్నత స్థానంలో ఉన్నారని అన్నారు. ఉద్యోగంలోనూ, ఉద్యమంలోనూ తన సహచరి జె.శారద సహకారం మరువలేనిదని ఆయన పేర్కొన్నారు.

ఆర్‌టిసి ఎండి ద్వారకా తిరుమలరావుతో అవార్డు అందుకుంటున్న దివాకర్

జె.దివాకర్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

విజయవాడ హెడ్ ఆఫీస్‌లో జె.దివాకర్ ఉద్యోగ విరమణ సందర్భంగా సత్కరిస్తున్న ఆర్‌టిసి ఎఫ్ఎ సిఇఒ ఎన్.సుధాకర్ రావు, చీఫ్ ఫైనాన్స్ మేనేజర్ రమణరావు, డిప్యూటీ సిఇఒ కె.రామ చంద్ర రావు, ఇతర సిబ్బంది ఘనంగా సన్మానించారు. శేష జీవితం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని కోరారు.

దివాకర్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

నిబద్ధతతో పని చేసిన కార్యకర్త

- ఆర్. లక్ష్మయ్య, జాతీయ ప్రధాన కార్యదర్శి, ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్

దివాకర్ 1990 నుంచి పరిచయం. అప్పటి నుంచి ఈరోజు దాకా ఎస్‌డబ్ల్యుఎఫ్, సిఐటియు పట్ల అచంచల విశ్వాసంతో నిబద్ధతతో పని చేసిన కార్యకర్త. ఆర్థికపరంగా, కుటుంబ పరంగా ఇబ్బందులు వచ్చినప్పటికీ సంఘాన్ని నిర్లక్ష్యం చేసిన దాఖలాలు లేవు. ప్రైవేట్ బస్సులకు వ్యతిరేకంగా రాయలసీమ ప్రాంతంలో పెద్ద ఉద్యమం నిర్వహించడంలో దివాకర్ పాత్ర ఎంతో ఉంది. 2005లో ఆర్‌టిసిని పరిరక్షించాలని జరిగిన తొమ్మిది రోజుల నిరవధిక నిరాహార దీక్షలు చేసిన వారిలో నాతో పాటు ఐదుగురి నాయకులలో దివాకర్ ఒకరు. తొమ్మిది రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేయడం గొప్ప పోరాటంగా ఆర్‌టిసి చరిత్రలో నిలిచిపోయింది. ఇంగ్లీష్ నుంచి తెలుగు అనువాదం చేయడంలో దిట్ట. చిన్న పెద్ద అని తేడా తెలియకుండా అందరిలోనూ కలిసిపోవడమే కాకుండా నమ్రత, నిబద్ధతతో ఉండటం ఈ రోజుల్లో చాలా అరుదుగా ఉంటుంది. అలాంటి అరుదైన లక్షణాలు కలిగిన వ్యక్తి దివాకర్.

ఇలాంటి వ్యక్తులను చాలా తక్కువ మందిని చూశాను

- జివి.రావు,డిప్యూటీ సూపరింటెండెంట్ (ఫైనాన్స్), ఎపిఎస్‌ఆర్‌టిసి హెడ్ ఆఫీస్, విజయవాడ

నాకు 2016 నుంచి ఇప్పటి వరకు మంచి అనుబంధం ఉంది. వ్యక్తిగతంగా మంచి వ్యక్తి, నిజాయితీ పరుడు, పనిలో నిబద్ధతగల వ్యక్తి. చెప్పిన పనిని తప్పక చేసే వ్యక్తి. ఇలాంటి వ్యక్తిని నా సర్వీస్‌లో తక్కువ మందిని చూసి ఉంటాను. ఆర్‌టిసి అధికారులతో మాట్లాడటంలో నేర్పరి, సంస్థ అభివృద్ధి కోసం కృషి చేయడంలో ముందుంటారు. ఇలాంటి వారు రిటైర్డ్ కావడం చాలా బాధగా ఉంది.

నీతి, నిజాయితీకి మారుపేరు

- ఎన్. సుధాకర్ రావు,
- ఫైనాన్షియల్ అడ్వైజర్ , చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్, ఎపిఎస్‌ఆర్‌టిసిఐ హెడ్ ఆఫీస్, విజయవాడ

ఆడిట్‌లో నీతి నిజాయితీగా మంచిగా పని చేసే వ్యక్తి. తప్పులను ఒప్పులను గుర్తించి సంస్థ అభివృద్ధి కోసం బాగా కృషి చేశారు. మంచి ఉద్యోగి, మంచి వ్యక్తి. ఆయన ఉద్యోగ విరమణ తర్వాత ఆయన జీవితం మరింత బాగుండాలని ఆకాంక్షిస్తున్నాను.

ఒక విశిష్టమైన ప్రయాణానికి వందనం

- మా నాన్నకు ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు - ప్రేమతో, గర్వంతో, కృతజ్ఞతతో, మీ బిడ్డ, హర్ష వర్ధన్ జల్లి

మే 31తో ఒక అధ్యాయం ముగుస్తోంది. మా నాన్నకు మాత్రమే కాదు. ఆయన సేవలతో, వ్యక్తిత్వంతో, నిబద్ధతతో జీవితాల్లో ప్రభావం చూపిన ప్రతి ఒక్కరికి. దశాబ్దాలు తరబడి అపారమైన కట్టుబాటు చూపిన అనంతరం, మానాన్న ఎపిఎస్‌ఆర్‌టిసిలో ఆడిట్ ఇన్‌స్పెక్టర్ పదవి నుండి ఉద్యోగ విరమణ పొందుతున్నారు. ఈ విషయాన్ని రాస్తున్నప్పుడు, ఆయన జీవితం ముందు నా మాటలు చిన్నవిగా అనిపిస్తున్నాయి. త్యాగాలతో నిండిన జీవితం, మౌనంగా పోరాడిన జీవితం, మానవతా విలువలతో నిండిన జీవితం. నా తండ్రి కేవలం పని మాత్రమే కాకుండా ఆయన బాధ్యతను ఒక పవిత్రమైన కర్తవ్యం లా మోశారు. ప్రతి ఉదయం ఆయన పనిచేసేందుకు వెళ్లినదంతే కాదు..ఒక కుటుంబ భవిష్యత్తును నిర్మించేందుకు, నమ్మిన వ్యవస్థను సేవ చేసేందుకు... గొంతులేని వారి తరపున గొంతుకగా ఉండేందుకు వెళ్లారు. నైతికతను దిశానిర్దేశకంగా, కృషిని ఆయుధంగా తీసుకొని, ఆయన కేవలం ఉద్యోగిగా కాకుండా ఒక ఆదర్శంగా ఎదిగారు. ఆడిట్ ఇన్‌స్పెక్టర్ అనే పదవి వాణిజ్యంగా వినిపించవచ్చు. కానీ ఆ సంఖ్యల వెనక, ఆ లెడ్జర్లు, నివేదికల వెనక, ఒక న్యాయాన్ని నమ్మే మనిషి ఉన్నాడు. ఎపిఎస్‌ఆర్‌టిసి ఆయనకు ఒక గుర్తింపుగా నిలిచింది. ఆయన నిబద్ధత భయంతో నడిచేది కాదు. భక్తితో నడిచేది. ఆయన పేరు సంస్థ గోడలపై పెద్ద అక్షరాల్లో ఉండకపోయినా, ప్రతి నిజాయితీగా జరిగిన లావాదేవీలో, ఆయన మద్దతించిన సంస్కరణల్లో, ఆయన విలువల వల్ల సరిగా నడిచిన సహోద్యోగుల్లో, ఆయన ముద్ర మాత్రం మిగిలింది. ఆయనను నిజంగా తెలుసుకోవాలంటే, కార్యాలయ గోడల్ని దాటి మన ఇంటి లోపలికి రావాలి. తీరని తుఫాన్లలో కూడా మమ్మల్ని నిలబెట్టినది ఆయనే. తన కలలను త్యాగం చేసి మాకోసం బతికారు. తన అవసరాలను పక్కన పెట్టి, మాకు ముందుగా ఉంచారు. తన కష్టాలను ఎప్పుడూ మాటల్లో చెప్పలేదు... కానీ మేము చూసాం. అనుభవించాం, వాటి వల్ల మేము మారాం. ఆయన ప్రేమ మాత్రమే కాదు.. బలం కూడా ఇచ్చారు. మార్గదర్శకత మాత్రమే కాదు.. ప్రేరణ కూడా. ముఖ్యంగా, ఎవరు చూస్తున్నా లేకపోయినా సరే, సత్యమార్గంలో ఉండడమే నిజమైన మహత్తు అని మాకు నేర్పించారు. సిఐటియుకు అనుబంధంగా ఉన్న ఎస్‌డబ్ల్యుఎఫ్‌లో కూడా ఆయన ప్రాణం పెట్టారు. ఆయనకు ఈ సంఘం కేవలం వేదిక కాదు.ఒక ఉద్యమం. కార్మికుల పక్షాన నిలబడ్డారు. న్యాయం కోసం పోరాడారు. మౌనం సులువుగా అనిపించిన చోట గొంతెత్తారు. ఈ పోరాటం తాత్కాలికం కాదు. ఆయన శ్రమకు మానవతకు గౌరవం కలిగి ఉండే తత్వాన్ని నమ్మారు. వ్యతిరేకత ఎదురైనా వెనక్కి తగ్గలేదుఎందుకంటే ఆయనకు లక్ష్యం స్పష్టంగా ఉంది. మనస్సు నిర్మలంగా ఉంది. ఇప్పుడు ఆయన అధికారికంగా ఉద్యోగం వీడుతున్నప్పుడు. ఆయన హృదయంలో ఎన్నో జ్ఞాపకాలుంటాయి. కొన్నింటి ఆనందం, మరికొన్నింటి కష్టాలు, కానీ అన్నింటికీ ఆంతర్యం ఉంది. సహోద్యోగులకు, స్నేహితులకు, ఉద్యమ సహచరులకు ఈ ప్రయాణంలో భాగస్వాములు అయినవారికి ధన్యవాదాలు. సంస్థకు అయనను తన పూర్తి వ్యక్తిత్వంతో నిలిచే స్థలం ఇచ్చినందుకు కృతజ్ఞతలు. మీరు పొందిన పదవి కంటే మీరు గడిపిన జీవితం మా ఎంతో గర్వకారణంగా భావిస్తున్నాం. మీరు మాకు చూపించిన బలమే కాదు ప్రేమ, సత్యం, కృషి అంటే ఏంటో నేర్పారు. పదవీవిరమణ ఒక ముగింపు కాదు మీరు చేసినదానికి జరుపుకునే పండుగ.

పెన్షన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే దస్తగిరి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు మండలం పరిధిలోని ఆర్.కొంతలపాడు గ్రామపంచాయతీలో ఎమ్మెల్యే బి.దస్తగిరి శనివారం పెన్షన్ పంపిణీ లో పాల్గొన్నారు. ఎంపిడిఒ, పంచాయతీ కార్యదర్శి, గ్రామ సర్పంచి, సచివాలయం సిబ్బంది ఇతర గ్రామ నాయకులు పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి

ఇళ్ల స్థలాల మంజూరుకు దరఖాస్తులు : కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఇళ్ల స్థలాలు లేని పేదలకు ఇళ్లస్థలాల మంజురుకు గాను దరాఖాస్తులు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి రంజిత్‌బాషా అధికారులను కోరారు. శనివారంకలెక్టరేట్‌లో నుండి వీడియో కాన్ఫరెన్సు ద్వారా జిల్లా అధికారులు, మండలనోడల్ అధికారులు,ఎంపిడివోలు, తహశీల్దార్లతో కలెక్టర్ వీడియోకాన్ఫరెన్సు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వర్షాకాలం మొదలైన నేపథ్యంలో పంచాయతీ, మున్సిపల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కెనాల్స్, చెరువులు వద్ద ఏమైనా మరమ్మతులు చేయాల్సి ఉంటే చేపట్టాలన్నారు. ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతంచేయాలన్నారు. ఈనెల 21 నిర్వహించే యోగా దినోత్సవంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలన్నారు. ప్రజాసమస్యలు పరిష్కార వేదికకు వచ్చే సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు సుకోవాలన్నారు.గృహనిర్మాణాలను కూడా వేగవంతంగా పూర్తిచేయాలన్నారు.అర్హత కల్గిన కౌలు రైతులకు గుర్తింపుకార్డులను జారీచేయాలన్నారు. పిఎం సూర్యఘర్ పథకం కింద దాదాపుగా 80వేల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని పేర్కొన్నారు. వీరందరికి రుణాలను ఇప్పించాలన్నారు. జెసి నవ్య, డిఆర్ఒ వెంకటనారాయణమ్మ, హౌసింగ్ పిడి చిరంజీవి, జెడ్పి సిఇఒ నాసరరెడ్డి పాల్గొన్నారు.

మా నాన్న మార్గదర్శి

- విష్ణు వర్ధన్, దివాకర్ కుమారుడు

నా జీవితం లో నన్ను తీర్చిదిద్దిన తొలి గురువు మా నాన్న. ఆయన ఉద్యోగ జీవితానికి ఈ ఆదివారం ముగింపు కానుండగా, మా కుటుంబానికి మాత్రం ఇది ఒక కొత్త ప్రారంభం లాంటిది. నాన్న ఎపిఎస్‌ఆర్‌టిసి శాఖలో తన సేవలను ఇన్ని సంవత్సరాలు అంకితభావంతో అందించారు. ఆయన సహనం, నిబద్ధత, ప్రతి పని పట్ల చూపిన నైపుణ్యం ఒక పాఠం. ఉద్యోగమంటే కేవలం వృత్తి మాత్రమే కాదు బాధ్యత అని ఆయన చేతనైన ప్రతి రోజు చూపారు. అందరికీ సహాయపడాలనే భావనతో ఆయన జీవితం గడిపారు. సహోద్యోగులకైనా, కుటుంబానికైనా, స్నేహితులకైనా అండగా నిలిచిన మానాన్న ఆత్మీయతకు గుర్తింపు ఇవ్వడం మా బాధ్యత. నాకు వ్యక్తిగతంగా నాన్న నుంచి నేర్చుకున్న ముఖ్యమైన గుణం పట్టుదల. ఏ పని చిన్నదైనా, పెద్దదైనా, పూర్తి నిబద్ధతతో చేయాలి అనే సందేశం ఆయన ప్రతి నడకలో ఉంది. ఈ సేవా విరమణ సందర్భంగా నాన్నకి నా హృదయపూర్వక వందనాలు. మీరు మాకు చూపిన మార్గం, మీ ఆదర్శాలు మా జీవితాలను వెలిగిస్తూనే ఉంటాయి. మేము ఈరోజు సక్సెస్ అయ్యి ఇలాంటి జీవితాన్ని అనుభవిస్తున్నామంటే దానికి కారణం మా నాన్న పడిన కష్టం. ఆయన నేర్పిన విలువలు, ఆయన మా కోసం చేసిన త్యాగాలు. మీ కొడుకుగా నేనెంతో గర్వపడుతున్నాను. మీరెప్పుడూ మాకు ప్రేరణగా నిలుస్తారు.

సాధారణ విద్యార్థులతో అసాధారణ ఫలితాలు

- కాంకర్‌కే సాధ్యం
- కరస్పాండెంట్ కొంకతి వేణుగోపాల్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

సాధారణ విద్యార్థులతో అసాధారణ ఫలితాలు సాధించడం కాంకర్‌కే సాధ్యమని కాంకర్ కళాశాల కరస్పాండెంట్ కొంకతి వేణుగోపాల్ తెలిపారు. ఇటీవల విడుదలైన ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరాల ఫలితాలే దీనికి నిదర్శనమని చెప్పారు. శుక్రవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు ఒకేషనల్ విద్యలో తక్కువ ఫీజుతో అత్యుత్తమ విద్యాబోధన అందించి, వారితో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నట్లు తెలిపారు. కళాశాల స్థాపించినప్పటి నుంచి ఫలితాల్లో అగ్రగామిగా నిలుస్తోందని చెప్పారు. తమ కళాశాలలో నర్సింగ్, ఎలక్ట్రికల్ టెక్నీషియన్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, పశు విద్య, వైద్య కోర్సులు ఉన్నాయని తెలిపారు. ఇంటర్‌తోనే ప్రభుత్వ, లేదా ప్రయివేట్ ఉద్యోగాలు రావాలంటే ఈ కోర్సులు తీసుకోవడం ఉపయోగకరమని చెప్పారు.

పశు విద్య, వైద్య కోర్సుతో పొందే ఉద్యోగావకాశాలు

వెటర్నరీ డాక్టర్, రైతు భరోసా కేంద్రాల్లో, గ్రామ పశు సంవర్ధక సహాయకులు, సొంతంగా డైరీ ఫార్మ్‌లను ఏర్పాటు చేసుకోవడం, పాల డైరీలో టెక్నీషియన్‌గా జాబ్ చేయడం.

నర్సింగ్ కోర్సుతో పొందే ఉద్యోగావకాశాలు

హాస్పిటల్స్, నర్సింగ్ హోమ్స్, హెల్త్ ఆర్గనైజర్స్, డయాగ్నోసిస్ సెంటర్స్.

కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ కోర్సుతో పొందే ఉద్యోగావకాశాలు

జూనియర్ ప్రోగ్రామర్, కంప్యూటర్ ఆపరేటర్, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్స్, సాఫ్ట్‌వేర్ మార్కెటింగ్, కంప్యూటర్ అకౌంట్ అసిస్టెంట్.

మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ కోర్సుతో పొందే ఉద్యోగావకాశాలు

ఆర్ అండ్ డి సెక్టార్స్ ఆఫ్ డ్రగ్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్, ల్యాబ్ క్వాలిటీ కంట్రోలర్, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్, డయాగ్నోస్టిక్ సెంటర్స్, హాస్పిటల్ ల్యాబ్ టెక్నీషియన్.

ఎలక్ట్రికల్ టెక్నీషియన్ కోర్సుతో పొందే ఉద్యోగావకాశాలు

సబ్ స్టేషన్లలో, సోలార్ కంపెనీల్లో, విద్యుత్ శాఖల్లో, ఎలక్ట్రానిక్ కంపెనీల్లో ఉద్యోగాలు.

కళాశాల ప్రత్యేకతలు

1. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు స్కాలర్‌షిప్ సౌకర్యం
2. అందరికీ అందుబాటులో ఉండేలా అతి తక్కువ ఫీజుతో ఉత్తమ విద్యా బోధన
3. డే కం రెసిడెన్షియల్ సౌకర్యం
4. అనుక్షణం విద్యార్థులను వెన్నంటి ఉండే అధ్యాపకులు
5. వారాంతపు పరీక్ష నిర్వహణ
6. అన్ని గ్రూపులకు అత్యాధునిక ల్యాబ్ సౌకర్యం
7. ఒకేషనల్ విద్యార్థులకు ప్రత్యేక సదుపాయాలు
8. శిక్షణ పూర్తయిన వెంటనే ఉద్యోగావకాశాలు కల్పించడం
9. జాబ్ మేళా ద్వారా వంద శాతం ఉద్యోగావకాశం
10. ఒకేషనల్ విద్యార్థులకు అప్రెంటిస్ సౌకర్యంతో పాటు నెలకు రూ.3 వేలకు పైగా స్టయిఫండ్
11. బ్రిడ్జి కోర్సు ద్వారా ఎంసెట్‌కు అర్హత పొందవచ్చు.

కళాశాల అడ్రస్

సిక్యాంపు సెంటర్ దగ్గర నంద్యాల చెక్ పోస్ట్ రోడ్డు కర్నూలు, సెల్ : 9959362229, 9010501799.

శేష జీవితం సుఖంగా గడవాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నా మిత్రుడు ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కోశాధికారి జల్లీ దివాకర్ రిటైర్ అయిన సందర్భంగా వారికి ఉద్యోగ విరమణ శుభా కాంక్షలు. ఆయన శేష జీవితం సంతోషంగా, ఆరోగ్యవంతంగా గడవాలని ఆకాంక్షిస్తున్నానని ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అయ్యపు రెడ్డి చెప్పారు. జె.దివాకర్ తను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి 40 సంవత్సరాలు పని చేశారు. ఆర్‌టిసి సంస్థలో సూపరిన్‌టెండెంట్ గా (ఫైనాన్స్) నిబద్ధతగా పనిచేసి మన్ననలు పొందారు. ఆర్‌టిసి కార్మిక ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. ఉద్యోగాన్ని, ఉద్యమాన్ని బ్యాలన్స్ చేసారు. కుటుంబ సభ్యులకు కూడా సమ ప్రాధాన్యత ఇచ్చారు. ఒక పరిపూర్ణ వ్యక్తిత్వం కలిగిన మనిషి. సమ సమాజం కోసం తపిస్తున్న వ్యక్తి. ఆర్‌టిసి కార్మికోద్యమ చరిత్రలో , రాష్ట్ర కార్మికోద్యమ చరిత్రలో నా మిత్రుడు దివాకర్‌కు ఒక పేజీ లిఖించబడి ఉందనడంలో అతిశయోక్తి లేదన్నారు.

దివాకర్‌కు రిటైర్మెంట్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

విద్యార్థి ఉద్యమ నాయకునిగా ప్రస్థానం ప్రారంభించి ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ట్రెజరర్‌గా,ఆర్‌టిసి వర్కర్ పత్రిక ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ చేస్తున్న జల్లి దివాకర్‌కు ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సి. హెచ్. సుందరయ్య అభినందనలు,శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాటల్లో... ఎస్ఎఫ్ఐ కర్నూలు జిల్లా ఉపాధ్యక్షులుగా, సిఐటియు జిల్లా ట్రెజరర్‌గా, 2002లో కర్నూలులో జరిగిన ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర మహాసభలో రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయి త్రికరణశుద్ధిగా తన బాధ్యతల్లో అంకితభావంతో కార్మిక వర్గ దృక్పథంతో పనిచేశారు. నాతో పాటు రాష్ట్ర కమిటీ సభ్యునిగా పనిచేస్తుండగా 1989 నుండి ఆయన సేవలను పరిశీలించాను. ఆయన కార్మిక వర్గ రాజ్యాన్ని, సోషలిజాన్ని కోరుకున్న గొప్ప కార్యకర్త, నాయకుడు. అనేక సంవత్సరాల పాటు ఆర్‌టిసి వర్కర్ పత్రికకు ఎడిటర్ గా పని చేశారు. ఆర్‌టిసి కోఆపరేటివ్ సొసైటీకి రెండు దఫాలుగా ఎన్నికయి పదేళ్లపాటు సేవలు అందించారు. 2004 డిసెంబర్‌లో హైదరాబాదులో ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకత్వం తక్షణ సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన పది రోజులు నిరవధిక దీక్షలో పాల్గొన్నారు. 2001 చారిత్రక ఆర్‌టిసి రక్షణ సమ్మెలో ప్రముఖ పాత్ర వహించారు. ఆ సందర్భంగా అరెస్టయి కడప సెంట్రల్ జైల్లో ఉన్నారు. 13 ఏళ్లపాటు హైదరాబాదు , విజయవాడ టెస్ట్ ఆడిట్ విభాగంలో పనిచేసారు. స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కేంద్రంలో పనిచేస్తూ సంఘ పురోభివృద్ధికి తోడ్పడ్డారు. ఆయన సేవలు కార్మికు ఉద్యమానికి ప్రజాస్వామ్య, సోషలిస్టు ఉద్యమానికి అందించగలరని ఆశాభావంతో ఉన్నాం.

రైతులకు పూర్తిస్థాయి నష్టపరిహారమివ్వాలి

- రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఎపిఐఐసిలో భూములు కోల్పోయిన రైతులకు పూర్తిస్థాయి నష్టపరిహారం ఇవ్వాలని ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం ఓర్వకల్లుమండలంలోని కొమరోలు గ్రామంలో జి.రామకృష్ణ, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి నాగన్నలు పర్యటించారు. అక్కడ రైతులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జి.రామకృష్ణ మాట్లాడుతూ... గత నలభై సంవత్సరాలుగా పేదలు సాగుచేసుకుంటున్న భూములను పరిశ్రమల పేరుతో ఎపిఐఐసి తీసుకుందన్నారు. పేదలు దాదాపుగా 3 నుంచి 4 ఎకరాలకుపైగా భూమిని సాగు చేసుకునారన్నారు. అందులో కొంతమంది 80 సెంట్లకు, మరికొంతమందికి 50 సెంట్ల భూమికి మాత్రమే పరిహారం ఇచ్చారన్నారు. పేదలు సాగు చేసుకుంటున్న భూములను అన్‌లైన్‌లో నమోదు చేసివారికి పూర్తిస్థాయిలో నష్టపరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు. నిరుపేద దళితులు కొన్ని సంవత్సరాలుగా సాగుచేసుకుంటున్న భూములకు వెంటనే పట్టాపాసుపుస్తకాలను ఇచ్చి అన్‌లైన్‌లో నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే ఈ గ్రామంలో తహశీల్దార్ పర్యటించి రైతుల సమస్యలను తెలుసుకొని వెంటనే పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే రైతులతో కలిసి తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. రైతులు లక్ష్మిదేవి, మద్దయ్య,మల్లేశ్వరి, కుమారి, అయ్యమ్మ, రామలక్ష్మమ్మ పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న రామకృష్ణ, నాగన్న

సమస్యల పరిష్కారానికి కృషి : కమిషనర్

- కొళాయిల్లో మురుగునీరు వస్తుందని చెబితే కేసులు పెట్టి అరెస్టు చేస్తారా
- సిపిఎం కో-ఆప్షన్ మెంబర్ వై. ఎల్లయ్య - రసాభాసగా కౌన్సిల్ సర్వసభ్య సమావేశం

రసాభాసగా కొనసాగుతున్న కౌన్సిల్ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - బేతంచర్ల

బేతంచెర్ల నగర పంచాయతీలో ఆయా కాలనీలలో నెలకొన్న సమస్యలన్నిటిని పరిష్కారం చేయడానికి సత్వర చర్యలు చేపడుతున్నామని కమిషనర్ హరి ప్రసాద్ అన్నారు. నగర పంచాయతీ కార్యాలయంలో కౌన్సిల్ సర్వసభ్య సమావేశం వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ముందుగా సమస్యల అజెండాను సీనియర్ అసిస్టెంట్ మల్లికార్జున ప్రవేశ పెట్టారు. వీటిపై వివరణ, సూచనలు సలహాల విషయమై కౌన్సిలర్లతో కమిషనర్ చర్చిస్తున్న సందర్భంగా సిపిఎం కో-ఆప్షన్ మెంబర్ వై. ఎల్లయ్య నగర పంచాయతీలోని సమస్యలు పరిష్కరించడంలో సంబంధిత అధికారులు విఫలమయ్యారని విమర్శించారు. కోటపేటలోని మహిళల మరుగుదొడ్ల శుభ్రం, దారి విషయంపై పలు సమావేశంలో ప్రవేశపెట్టినా ఎందుకు పరిష్కరించలేదో చెప్పాలని నిలదీశారు. అలాగే సంజీవ్ నగర్ కాలనీలో తాగునీరు పైపులు మురుగు కాలువల నీరు వస్తుందని అధికారుల దృష్టికి తీసుకెళ్తే అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నామని కేసులు పెట్టి అరెస్టు చేయించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. అలాగే డ్రైవర్స్ కాలనీ, సుందరయ్య కాలనీ, అల్లా బకాష్ దర్గా, కోటపేట ఆయా కాలనీలలో గోరుకల్లు రిజర్వాయర్ నుండి నీళు వేసవి కంటే ముందే అందిస్తామని చెప్పారని గుర్తు చేశారు. ఇంతవరకు ఆ కాలనీలకు గోరకల్లు నీరు రాకపోగా బోర్ వాటర్ 4, 5 రోజులకు ఒకసారి వస్తున్నాయని తెలిపారు. నగర పంచాయతీలోని వీధులలో గల వీధి కుక్కలను పట్టుకునేందుకు భారీగా బడ్జెట్ ఖర్చు పెట్టామని అజెండాలో ఉన్న విషయాన్ని వివరించాల్సిందిగా ప్రశ్నించారు. సమస్యలను అడుగుతుండగా టిడిపి కౌన్సిలర్ రామాంజి మధ్యలో కల్పించుకొని అనవసరంగా వాగ్వివాదం చేశారు. కౌన్సిల్ సర్వసభ్య సమావేశం రసాభాసగా మారింది. వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు కల్పించుకొని ఇరువురికి సర్ది చెప్పారు. కౌన్సిలర్లు పోయిన సమావేశంలో ప్రవేశపెట్టిన అజెండాలు ఎన్ని పరిష్కారం అయ్యాయి, ఎన్ని వాయిదా పడ్డాయి అనే ప్రస్తావన లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత కమిషనర్, అధికారులు సమస్యల పరిష్కారానికి ఎంత బడ్జెట్ కేటాయించారో వచ్చే సమావేశంలో వివరించాలని కోరారు. కమిషనర్ హరిప్రసాద్ మాట్లాడుతూ నగర పంచాయతీలోని సంజీవ నగర్ కాలనీలో మురుగునీరు సమస్య పరిష్కారం అయ్యిందని, అలాగే కోటపేట మహిళల మరుగుదొడ్ల విషయం అలాగే డ్రైవర్స్ కాలనీ సుందరయ్య కాలనీ, అల్లా ప్రకాష్ దర్గా కాలనీలకు సాధ్యమైనంత త్వరగా గోరకల్లు రిజర్వాయర్ శుద్ధ జల నీరు పైప్ లైన్ కలెక్షన్ చేసి ప్రజల దాహార్తిని తీరుస్తామన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు ఇబ్రహీం, కోట్ల మధు, ఆదిలక్ష్మి, నంద్యాల కుమారి, అంజి, ముబీనా, అబ్దుల్ రహిమాన్, హుస్సేన్ బి. విజయలక్ష్మి, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాల్లో రాజీపడితే ఉపేక్షించేది లేదు : మంత్రి బీసీ

కోతకు గురైన హైవే రోడ్డును పరిశీలిస్తున్న మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, ఎమ్మెల్యే గిత్త జయసూర్య

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్/పాణ్యం

నేషనల్ హైవే 340సి పనుల్లో నాణ్యతపై మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నందికొట్కూరులో జాతీయ రహదారి 340సి పనులను ఎమ్మెల్యే ఎమ్మెల్యే గిత్త జయసూర్యతో కలిసి మంత్రి శనివారం పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ.. జాతీయ రహదారి 340సి పనుల్లో నాణ్యతపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రహదారుల నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాల్లో రాజీ పడితే సహించేది లేదని హెచ్చరించారు. రోడ్డు పనులకు నాసికరం మట్టిని వాడడంతో రోడ్డు కోతకు గురైందన్నారు. రోడ్డు నిర్మాణాలు భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా ఉండాలని, నాణ్యతకు తిలోదకాలిస్తే సహించేది లేదని కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు. గతంలో సదరు కాంట్రాక్టర్ నాణ్యత లేని రోడ్ల నిర్మాణ పనులపై వార్తల నేపథ్యంలో.. విజిలెన్స్ ఎంక్వైరీ చేయాలని ఆదేశిస్తే ఇప్పటి వరకు ఆ రిపోర్టు రాలేదన్నారు. విజిలెన్స్ ఎంక్వైరీ కనుమరుగవడం వెనుక ఎవరు ఉండి నడిపిస్తున్నారో బయట పెడతామన్నారు. నేడు జాతీయ రహదారుల నిర్మాణాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా తీసుకుని పని చేస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజాసొమ్మును దుర్వినియోగం చేసి, నాణ్యత లేని రోడ్లను నిర్మించే కాంట్రాక్టర్ల విషయంలో రాజీపడొద్దని సాక్షాత్తూ ముఖ్యమంత్రే ఆదేశాలు ఇచ్చారని గుర్తు చేశారు. నాణ్యతా ప్రమాణాలు పాటించని రోడ్ల వల్ల ప్రజలు ప్రమాదాల పాలయ్యే అవకాశం ఉందన్నారు. క్వాలిటీ కంట్రోల్ సర్టిఫికేట్‌లు జారీ చేసిన అధికారులపై సైతం విచారణకు ఆదేశిస్తామని తెలిపారు. మంత్రి వెంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వీరం ప్రసాద్ రెడ్డి, మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, కాతా రమేష్ రెడ్డి, పలుచని మహేశ్వర్ రెడ్డి, అధికారులు ఉన్నారు.

మట్టిని అమ్ముకుంటున్న టిడిపి నాయకులు

- మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి - 4న వెన్నుపోటు దినంగా నిరసన

ప్రజాశక్తి - బనగానపల్లె రూరల్

టిడిపి నాయకులు బనగానపల్లెలో ఫ్రీగా ఉన్న మట్టి గ్రావెల్‌ను టిప్పర్ 1200 రూపాయలుగా అమ్ముకుంటూ దోచుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం బనగానపల్లెలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 4న వెన్నుపోటు దినంగా ప్రకటిస్తూ నిరసన తెలుపుతున్నట్లు తెలిపారు. టిడిపి అధికారంలోకి రావడానికి చంద్రబాబు నాయుడు అబద్ధాలు చెప్పి, అధికారంలోకి వచ్చి ఇప్పటి వరకు ప్రజలకు ఎలాంటి సంక్షేమ పథకాలు, కూడా నెరవేర్చలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్త్రీలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో రెడ్ బుక్కు రాజ్యాంగం నడుస్తుందని రాష్ట్రంలో 766 కేసులలో 390 హత్య కేసులు నమోదు అయ్యాయని, వైసిపి నాయకులపై 2466 అక్రమ కేసు నమోదు చేశారని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక దేవాలయ భూములలో, వర్క్ బోర్డ్ భూములలో, అక్రమ మైనింగ్ జరుగుతుంటే అధికారులకు కనిపించడం లేదన్నారు. గ్రామ గ్రామాన బెల్ట్ షాపులు, నాటు సారా ఏరులై పారుతూ, డోర్ డెలివరీ కూడా ఇస్తున్నారని తెలిపారు. టిడిపి మహానాడులో జగన్ స్మరణ చేయడానికి సరిపోయిందని, ప్రజలకు ఏమి చేస్తామనేది తెలపలేదన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు అబ్దుల్ ఫైజ్, శంకర్ రెడ్డి, జావిద్ హుస్సేన్, గుండం నాగేశ్వర్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : జూన్ 4న నిర్వహించే వెన్నుపోటు నిరసన గోడ పత్రికను వైఎస్ఆర్‌సిపి మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి పార్టీ కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. బుధవారం నిర్వహించే వెన్నుపోటు నిరసనను జయప్రదం చేయాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రజలకు చేస్తున్న అన్యాయానికి నిరసనగా చేపట్టే వెన్నుపోటు నిరసనకు పట్టణ, వార్డు, గ్రామ బూత్ కమిటీలు జన సమీకరణ చేయాలని సూచించారు. కార్యక్రమంలో శిల్పా భువనేశ్వర్ రెడ్డి, వైఎస్ఆర్‌సిపి నాయకులు కె.పి విజయ చౌదరి, సయ్యద్మీర్, రాజమోహన్ రెడ్డి, కుందూరి శివారెడ్డి, అహమద్ హుస్సేన్, దుర్గమ్మ, కౌన్సిలర్ సుగుణమ్మ, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్‌దారుల కళ్లలో ఆనందం : మంత్రి ఫరూక్

ప్రజాశక్తి - నంద్యాల అర్బన్

పింఛన్ పంపిణీ చేసినప్పుడు లబ్ధిదారుల కళ్ళల్లో ఆనందం కనిపించిందని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. శనివారం నంద్యాల టౌన్ 10వ వార్డు నశ్యం వీధిలో బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గోవిందు నాయుడు ఆధ్వర్యంలో లబ్ధిదారులకు మంత్రి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 200 రూపాయలు ఉన్న పెన్షన్ వేయి రూపాయలు చేసిన ఘనత చంద్రబాబుకే దక్కిందని, అలాగే 1000ని 2000 వేలు చేశారని, గత ప్రభుత్వంలో 2000 ఉన్న పెన్షన్‌ని రూ.3000 పెంచుతూ ఐదు సంవత్సరాలు గడిపిన వైయస్ జగన్మోహన్ రెడ్డి మాట తప్పారని, ఏటా రూ.250 పెంచుతూ ప్రజలను నమ్మకద్రోహం చేశారని అన్నారు. టిడిపి అధికారం చేపట్టిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పిన మాట ప్రకారం పెన్షన్‌ని రూ.4 వేలకు పెంచుతూ, అలాగే మూడు నెలల ముందే ప్రతి నెల 1000 రూపాయలు చొప్పున మొత్తం కలిపి 7000 రూపాయలు అధికారం చేపట్టిన మొదటి నెలలోనే పంపిణీ చేశారన్నారు. అనంతరం పింఛన్ లబ్ధిదారులకు అల్పాహార విందును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నంద్యాల ఇంచార్జి కమిషనర్ వెంకట దాస్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఏవిఆర్ ప్రసాద్, పట్టణ అధ్యక్షులు మునియార్ ఖలీల్, 19వ వార్డు ఇంచార్జి షేక్ మున్నా, 15 వార్డ్ సీనియర్ నాయకులు నాగేశ్వరరావు , మాజీ కౌన్సిలర్లు అజ్మీర్ , మిద్దె హుస్సేన్, 10 వార్డ్ నాయకులు ఫయాజ్ , ఆసిఫ్, సమీయుల్లా , హుస్సేన్ వాలి , మాభాష , జాకీర్, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలను మంత్రి తనిఖీ

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు : శ్రీశైల మండలం సున్నిపెంటలోని ప్రభుత్వ వైద్యశాలను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి శనివారం తనిఖీ చేశారు. అనంతరం వైద్యశాలలోని రోగులను కలిసి అక్కడ అందుతున్న మందులపై, వైద్యంపై అడిగి తెలుసుకున్నారు. అలాగే వైద్యశాలల్లో సిబ్బంది కొరత, మందులపై డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు.

చెంచులకు కలెక్టర్, జెసి పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు : శ్రీశైలం దేవస్థానం పరిధిలో ఉన్న మేకల బండ చెంచు కాలనీలో జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, జెసి విష్ణు చరణ్, ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డిలు శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ వెంకట శివప్రసాద్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రెయినేజీ సమస్యను పరిష్కరిస్తాం : కోట్ల

ప్రజాశక్తి - డోన్ : పట్టణంలోని గుత్తి రోడ్ మసీదు సమీప ప్రాంతంలో నెలకొన్న డ్రెయినేజీ సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి తెలిపారు. మసీదు ప్రాంత వాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన శనివారం అడిగి తెలుసుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యను తక్షణమే పరిష్కరించాలంటూ సంబంధిత మున్సిపల్, నేషనల్ హైవే, ఇంజనీరింగ్ విభాగాల అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రజల ఆరోగ్య భద్రతకు భంగం కలిగించే ఇలాంటి సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల శ్రేయస్సే తనకు ప్రధానమని, అవసరమైతే మళ్లీ అధికారులతో సమావేశమై సమస్య పరిష్కారాన్ని పర్యవేక్షిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

నగర పంచాయతీ మేనేజర్‌గా సువర్ణ లక్ష్మీ

ప్రజాశక్తి - బేతంచర్ల : బేతంచెర్ల నగర పంచాయతీ మేనేజర్‌గా సువర్ణ లక్ష్మి శనివారం బాధ్యత చేపట్టారు. ఈమె కడప జిల్లా ఎర్రగుంట్ల మున్సిపల్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తూ ప్రమోషన్‌పై నగర పంచాయతీ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ కౌన్సిలర్లు, నగర పంచాయతీ సిబ్బంది సంబంధిత అధికారులు ప్రజల సహకారంతో నగర పంచాయతీలోని సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు.

ఉద్యోగికి పదవీ విరమణ సహజం : ప్రిన్సిపాల్

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్ : ప్రతి ఉద్యోగికీ పదవీ విరమణ సహజమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ సునీత పేర్కొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్యశాస్త్రం అధ్యాపకురాలిగా పని చేస్తున్న డాక్టర్ అమరావతి పదవీ విరమణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ సునీత, అధ్యాపక, అధ్యాపకేతర బృందం డాక్టర్ అమరావతిని సన్మానించారు. కార్యక్రమంలో ఐక్యుఏసి కో-ఆర్డినేటర్ డాక్టర్ పరిమిలాదేవి, విద్యార్థిని, విద్యార్థులు, డాక్టర్ అమరావతి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో విద్యార్థికి సిల్వర్ మెడల్

ప్రజాశక్తి - ప్యాపిలి : విశాఖపట్నంలో జరిగిన బాక్సింగ్ జూనియర్ పోటీల్లో బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని అర్చన సిల్వర్ మెడల్ సాధించింది. విశాఖపట్నం ఫోర్త్ స్టేడియంలో మే 31న బాక్సింగ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో మెడల్ సాధించడానికి కారణమైన పిఇటి విజయలక్ష్మిని అభినందించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ అసోసియేషన్ వెంకటేశ్వరరావు, ప్రెసిడెంట్ వేణుగోపాల్, సెక్రటరీ లక్ష్మీదేవి, చైర్మన్ చిట్టిబాబు, నంద్యాల జిల్లా అసోసియేషన్ సెక్రెటరీ ఫయాజ్, ప్రసాద్ నాయక్ పాల్గొన్నారు.

ప్రాజెక్టుల అభివృద్ధిపై చిత్తశుద్ధి శూన్యం

- సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి

ప్రజాశక్తి - కొత్తపల్లి

రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధిపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి అన్నారు. మండలంలోని సంగమేశ్వరంలో సిద్దేశ్వరం అలుగు ప్రజా శంఖుస్థాపన 9వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ప్రజా అనంతరం దశరథరామిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర విభజన తరువాత హైదరాబాద్ కేంద్రంగా పరిపాలన చేయకుండా అమరావతి కేంద్రంగా నిధులన్నీ అక్కడే ఖర్చుపెట్టడంతో రాష్ట్రం దివాలా తీసే పరిస్థితులను సృష్టించారని విమర్శించారు. ఏపీ అంటే అమరావతి పోలవరం అని ఒకరు, మూడు రాజధానులని మరొకరు తమస్వార్థ, రాజకీయ, ఆర్థిక సామ్రాజ్యాలను నిర్మించు కోవడానికే ప్రయత్నిం చారే తప్పా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ఏమాత్రం చిత్తశుద్ధి చూపలేదని దుయ్య బట్టారు. పట్టిసీమ పూర్తి చేసి రాయలసీమకు నీళ్లు ఇస్తామని చెప్పిన పాలకులు అది మరచి నేడు గోదావరి బనకచర్ల అంటూ మరో కొత్త నాటకానికి తెరలేపుతూ రాయలసీమ ప్రజలను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బహిరంగ సభలో ఏపీ రైతు సంఘం నాయకులు రాజశేఖర్, వెంకటేశ్వర్లు, హిందూపురం చైతన్య సొసైటీ అధ్యక్షులు గంగిరెడ్డి, సామాజిక రాయలసీమ వేదిక కన్వీనర్ డాక్టర్ నాగన్న, విరసం నాయకులు వరలక్ష్మి, పినాకపాణి, అనంతపురం ఓపిడిఆర్ రామ్ కుమార్, భారతీయ కిసాన్ సంఘ్ కడప జిల్లా నాయకులు వెల్లాల సహదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ మెయిన్స్‌రాత పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు

-ఎస్‌పి విక్రాంత్‌పాటిల్ వెల్లడి
-అన్ని పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట భద్రత
-సిసి కెమరాలు , డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షణ
-పరీక్ష ప్రారంభానికి గంట ముందే అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి

ప్రజాశక్తి-కర్నూలు క్రైం

ఆంధ్రప్రదేశ్ పోలీసు రిక్రూట్ మెంట్ బోర్డు రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 1 వ తేది ఆదివారం పోలీసు కానిస్టేబుల్ (సివిల్,ఎపిఎస్పీ) అభ్యర్థులకు మెయిన్స్ రాత పరీక్షలను కర్నూలు పట్టణం లోని 16 పరీక్షా కేంద్రాలలో పరీక్షలు నిర్వహిస్తున్నామని, పూర్త పకడ్బంధీ ఏర్పాట్లు చేశామని కర్నూలుఎస్పి విక్రాంత్ పాటిల్ తెలిపారు. రాత పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో విలేకరుల సమావేశంలో తెలిపారు. హాల్ టికెట్ తో పాటు ఆధార్ కార్డు లేదా ఇతర గుర్తింపు కార్డు తప్పనిసరిగా ఉండాలన్నారు. కర్నూలు కేంద్రంలో మొత్తం 16 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షకు మొత్తం 7,588 మంది అభ్యర్థులు హాజరు కానున్నారన్నారు. ఈ పరీక్ష ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు ఉంటుందన్నారు. పరీక్ష రాసే అభ్యర్థులకు జిల్లా ఎస్‌పి సూచనలు తెలిపారు. పరీక్ష రాసే అభ్యర్థులను ఉదయం 9 గంటల నుండే పరీక్ష హాలులోకి అనుమతిస్తారన్నారు. ఉదయం 10 గంటల తర్వాత ఎట్టి పరిస్థితులలోనూ పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించరన్నారు. హాల్ టికెట్ తో పాటు బ్లూ లేదా బ్లాక్ బాల్ పెన్నులను తెచ్చుకోవాలన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల హాజరును బయోమెట్రిక్ ద్వారా నమోదు చేస్తారన్నారు. సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వాచ్‌లు, ఇతర వస్తువులు పరీక్ష హాల్లోకి అనుమతించబోమన్నారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద సిసి కెమరాలు, డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. అన్నీ పరీక్ష కేంద్రాల చుట్టూ 200 మీటర్ల పరిధిలోని జిరాక్స్, కంప్యూటరు కేంద్రాలను మూసివేయాలని ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. కర్నూలులో మొత్తం 16 పరీక్షా కేంద్రాలలో 7,588 మంది అభ్యర్థులు మెయిన్స్ రాత పరీక్ష వ్రాస్తున్నారని ఆయా పరీక్ష కేంద్రాల వద్ద ఏలాంటి సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసుకునే విధంగా సంబంధిత పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

టెన్త్ మొదటి బ్యాచ్‌లోనే 'బిర్లా ఓపెన్ మైండ్స్' అద్భుత ఫలితాలు

స్కూల్ ప్రిన్సిపాల్ కాదంబరి వెల్లడి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ 2025 సిబిఎస్ఇ పదవ తరగతి ఫలితాల్లో మొదటి బ్యాచ్ లోనే అందరూ విద్యార్థులు ఫస్ట్ క్లాస్ లో 100 శాతం ఉత్తీర్ణత సాధించి అద్భుత ఫలితాలను సాధించారని స్కూల్ ప్రిన్సిపల్ ఎ.కాదంబరి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె ప్రజాశక్తితో మాట్లాడుతూ సిబిఎస్ఇ ఫలితాలలో డి.ఖ్యాతి రెడ్డి 94.4 శాతం, ఎస్.హన్సిక 93.8 శాతం, జి.నాగ యతిన్ 93.2శాతం, ఎం.హాస్యక్షిత 91.8శాతం,ఆర్.వెంకట విఘ్నేష్ 91.4శాతం, సి.వెంకట సాయి కౌశిక్ 90.4శాతం అత్యధిక శాతం మార్కులు పొందగా 90శాతం శాతం పైగా మార్కులు ఆరుగురు విద్యార్థులు, 80శాఆ పైన 13 మంది విద్యార్థులు,70శాతం పైన - ఏడుగురు విద్యార్థులుతో పాటు అందరు విద్యార్థులు ఫస్ట్ క్లాస్ లో ఉత్తీర్ణత సాధించడం ఆనందం కలిగించిందని ఆమె అన్నారు. ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులకు,

సహకరించిన తల్లిదండ్రులకు కృతజ్ఞతాభినందనలు తెలిపారు. సిబిఎస్ఇ ఐజిసిఎస్ఇ, ఐబీ బోర్డుల సమ్మేళనంతో బాగా పరిశోధించబడిన విద్యా పాఠ్యాంశాలతో పాటు పిల్లలలో కేంద్రీకృత, ప్రత్యేకమైన బోధన అభ్యాసకుల సృజనాత్మకతో పిల్లలలో స్ఫూర్తిని నింపుతూ ఉత్సుకతను పెంచడం అన్వేషణ సృజనాత్మకతను ప్రోత్సహించారన్నారు. అత్యాధునిక తరగతి గదులు, ఆధునిక సైన్స్ , ఐటీ ప్రయోగశాలలు, ప్రపంచ స్థాయి లైబ్రరీలు, పచ్చని బహిరంగ ప్రదేశాలు, క్రీడలు అండ్ సృజనాత్మక కళలల సౌకర్యాల సమాహారం బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ నన్నూరు ప్రత్యేకతలని అన్నారు. అద్భుతమైన బోధనా ట్రాక్ రికార్డులతో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో కూడిన అధ్యాపక బృందం నిత్య పర్యవేక్షణ లోని స్కూల్ యాజమాన్యం చైర్మన్ ఎవి రమణ రెడ్డి , సి.ఇ.ఒ చరిత డైనమిక్ నాయకత్వంలో ఈ అద్భుత ఫలితాలను సాధిస్తున్నామని తెలిపారు. ఎకో ఫ్రెండ్లీ స్కూల్ డిజైన్, అత్యాధునిక సాంకేతికత ఆధారిత తరగతి గదులు, పరిశోధించబడిన అండ్ ప్రణాళికాబద్ధమైన పాఠ్యాం శాలు, గ్రేడ్ -7 నుండి ఐఐటీ కోచింగ్,వీక్లీ క్లబ్ కార్య కలాపాలు, ఇంటర్ డిసిప్లినరీ హోలిస్టిక్ అప్రోచ్,ప్రాజెక్ట్ అండ్ కాన్సెప్ట్ ఓరియెంటెడ్ మెథడాలజీ హై-టెక్ కంప్యూటర్ అండ్ ఐటీ ల్యాబ్స్,అధునాతన గణితం, భాషా ప్రయోగశాలలు కళ, నృత్యం, సంగీతం, టైక్వాం డోలలో ప్రత్యేక శిక్షణ,ఉత్తేజకరమైన ఇండోర్ గేమ్‌లతో పాటు క్రికెట్, బాస్కెట్‌బాల్, టెన్నిస్, ఫుట్‌బాల్, త్రో బాల్ అండ్ ఖో - ఖోలో నిపుణులైన కోచింగ్ సౌకర్యాల కలవని అన్నారు. డే కమ్ రెసిడెన్షియల్ క్యాంపస్ లో హోమ్లీ రెసిడెన్షియల్ ఎన్విరాన్మెంట్ కలదని తెలిపారు.

సి బెళగల్‌లో వికసిత్ కృషి సంకల్ప అభియాన్

ప్రజాశక్తి-సి బెళగల్

సి బెళగల్ లోని రైతు సేవా కేంద్రంలో ఎఒ మల్లేష్ కుమార్ శనివారం వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం చేపట్టారు. ఇందుకు ప్రధాన శాస్త్రవేత్త రాఘవేంద్ర, జిల్లా సంచాలకులు సాలురెడ్డి, అదనపు శాస్త్రవేత్త శివకృష్ణ, డిఆర్‌సి ఎఇఎ గిరీష్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ ఖరీఫ్ సాగులలో పంటల సస్య రక్షణ పద్ధతులు తప్పక పాటించాలన్నారు. అలాగే మొక్కకు మొక్కకు మధ్య అడుగు దూరం ఉండాలని సాలూకు సాలూకు మూడు అడుగుల దూరం ఉండాలని రైతులకు సూచించారు.ఆహార పంటలపై ఆసక్తి పెంచుకొని కృత్రిమ సాగుపై అవగాహన కలిగి అధికారుల సలహాలు పాటిస్తే తప్పక దిగుబడులు సాధిస్తారన్నారు.అనంతరం పెరటి తోటల విత్తనాల కిట్ లను పంపిణీ చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎఒ మల్లేష్

అటెండర్‌కు ఉద్యోగ విరమణ సన్మానం

సి బెళగల్ రెవిన్యూ కార్యాలయంలో పని చేస్తున్న అటెండర్ రంగన్న ఉద్యోగ విరమణ సందర్భంగా శనివారం ఘన సన్మానించారు. తహసీల్దార్ పురుషోత్తం సమక్షంలో రెవిన్యూ ఉద్యోగులు,సిబ్బంది,సహచర ఉద్యోగులు తదితరులు హాజరై పదవి విరమణ ప్రతి ఉద్యోగికి సహజమని పలువురు పేర్కొన్నారు. అలాగే విశ్రాంత దినాలలో కుటుంబంతో ఆరోగ్యాంగా, సంతోషంగా గడపాలని తదితరులు పేర్కొన్నారు.

11న పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల పర్యటన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కాంగ్రెస్ పార్టీ బలోపేతం దిశగా కర్నూలులో జూన్ 11న పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పర్యటించనున్నారని కాంగ్రెస్ పార్టీ కర్నూలు నగర అధ్యక్షుడు జిలానీబాష,మాజీ ఎమ్మెల్సీ ఎం సుధాకర్‌బాబు పేర్కొన్నారు.11న మధ్యాహ్నం మూడుగుంటలకు కర్నూలులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహిస్తారని పేర్కొన్నారు. శనివారం కర్నూలులోని స్థానిక డిసిసి కార్యాలయంలో నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికలల్లో ఇచ్చిన హామిలను నెరవేర్చలేదన్నారు. రాష్ట్ర విభజనకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. అందుకే రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రత్యామ్నాయంగా మారేందుకుగాను పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిళ దృష్టి సారించారన్నారు. ఇందులో భాగంగా ఈనెల 11న కర్నూలులో వైఎస్ షర్మిళ పర్యటించి నియోజికవర్గ ఇంచార్జ్‌లు కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నేతలతో సమావేశం అవుతారన్నారు. వైఎస్ షర్మిల పర్యటనను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు కృషిచేయాలని కోరారు.

జూన్2న కలెక్టరేట్‌లో గ్రీవెన్సు

జూన్ 2వతేదిన కలెక్టరేట్ కార్యాలయంలోని సునయన అడిటోరియంలో ప్రజాసమస్యలు పరిష్కార వేదిక కార్యక్రమంలో గ్రీవెన్సు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి రంజిత్‌భాష ఓ ప్రకటనలో శనివారం పేర్కొన్నారు.జిల్లా కేంద్రంతోపాటు అన్ని రెవెన్యూడివజనల్,మున్సిల్,మండల కార్యాలయాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

రహదారి ప్రమాదాల నియంత్రణే లక్ష్యం

-కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ కోయప్రవీణ్
-జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ప్రతి శనివారం రోడ్డు భద్రత పై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పోలీసు అధికారులకు కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్, జిల్లా ఎస్పి విక్రాంత్ పాటిల్‌లు ఆదేశాలు జారీ చేశారు. వాహనదారులు రహదారి భద్రత నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఈ రోజు జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆయా పోలీసుస్టేషన్ పరిధులలో జిల్లా పోలీసు అధికారులు ప్రజలకు రోడ్డు భద్రత , ట్రాఫిక్ నిబంధనల పై సమావేశాలు నిర్వహించి, అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. బైక్ లు నడిపే వారు ఖచ్చితంగా హెల్మెట్లు ధరించే విధంగా , ఓవర్ స్పీడ్ , ఓవర్ లోడ్ తో వాహనాలు వెళ్ళకుండా, డ్రంకెన్ డ్రైవ్ చేయరాదని తదితర రోడ్డు భద్రత ప్రాముఖ్యతల పై ప్రజలకు అవగాహన కల్పించారు.

రిటైర్మెంట్ జీవితం ఆనందంగా గడపాలి

ప్రజాశక్తి కర్నూలు కార్పొరేషన్

ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు తమ జీవితాన్ని ఆనందంగా గడపాలని నగరపాలక కమిషనర్ యస్.రవీంద్ర బాబు అన్నారు. శనివారం నగరపాలక కార్యాలయంలో ఉద్యోగ విరమణ పొందిన జూనియర్ అసిస్టెంట్ యస్.శేషాద్రిని సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, అకౌంట్స్ ఆఫీసర్ చుండి ప్రసాద్, ఆర్ఓలు జునైద్, ఇశ్రాయేల్, టిపిఆర్ఓ వెంకటలక్ష్మి, సూపరింటెండెంట్లు రామక్రిష్ణ, సుబ్బన్న, స్వర్ణలత, మంజూర్ బాష, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

రీవాల్యూయేషన్ ఫీజులను వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పదోతరగతి మూల్యాంకణంకు సంబంధించి రీవాల్యూయేషన్ కు దరాఖాస్తు చేసుకున్న విద్యార్థులు చెల్లించిన ఫీజులను తిరిగి చెల్లించాలని ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అబుబాకర్, సాయి ఉదయ్‌లు శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. పదోతరగతి మూల్యాంకణాన్ని సరిగ్గా నిర్వహించకపోవడంతో విద్యార్థులు నష్టపోయారన్నారు. వేలాది మంది విద్యార్థులు రీవాల్యూయేషన్‌కు దరాఖాస్తు చేసుకుంటే అనేకమందికి మార్కులు పెరిగాయన్నారు. హడావుడిగా మూల్యాంకణాన్ని నిర్వహించి విద్యాశాఖ అధికారులు చేతులు దులుపుకునారన్నారు. వెంటనే రీవాల్యూయేషన్‌కు దరాఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఫీజులను తిరిగి చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు.

సుంకేసులలో పెట్రోల్ బంక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

పెట్రోల్ పంపును ప్రారంభించిన ఎమ్మెల్యే దస్తగిరి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు మండలం, సుంకేసుల గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్ఆర్ పెట్రోల్ బంకును కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. పెట్రోల్ బంకు యజమానులు విశ్వేశ్వర రెడ్డి, మార్కండేయ ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. , ఆ తర్వాత అక్కడ ఉన్న కారు కు పెట్రోల్ పంపుతో పెట్రోల్‌ను ఫుల్ చేశారు. ప్రజలకు నాణ్యమైన పెట్రోలు అందించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

ఉద్యోగ నియామక పత్రాలు అందజేస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాష, జెసి డాక్టర్ నవ్య

కారుణ్య నియామక పత్రాలు అందజేత

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో అయా ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్నటువంటి పోస్టులను కారుణ్య నియాపకాలు ద్వారా శనివారం జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగంలో చేరడమంటే ప్రజలకు సేవచేయడమేనని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను, కార్యక్రమాలను పకడ్బందీగా అమలయ్యేలా చూడాలని జిల్లా కలెక్టర్ ఉద్యోగ నియమాకాలను పొందిన వారిన కోరారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి నవ్య, డిఅర్ఓ వెంకటనారాయణమ్మ, కలెక్టరేట్ ఎఓ జయశ్రీ, సూపరిండెంట్ జలాలుద్దిన్‌బాష తదితరులు పాల్గొన్నారు.

పత్తి ఉత్పత్తి పద్ధతులపై అవగహన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పత్తి పంటల ఉత్పత్తిపై రైతులకు అవగహన కల్పిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి రంజిత్‌బాష వెల్లడించారు.శనివారం కలెక్టరేట్‌లో వ్యవసాయ శాఖ రూపొందించిన నేల అరోగ్యసంరక్షణ పత్తిలో పంటరక్షణ యాజమాన్యం బుక్‌లెట్‌ను జిల్లా కలెక్టర్ అవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పత్తిని ఎక్కువ మొత్తంలో సాగుచేస్తునారన్నారు. బెటర్ కాటన్ ప్రాజెక్టును రూపొందించి కోడుమూరు, దేవనకొండలలో అమలు చేస్తునామన్నారు. 8వేలమందికిపైగా రైతులను భాగస్వామ్యం చేస్తున్నామని తెలిపారు. జెసి బి నవ్య, డిఅర్ఓ వెంటనారాయణమ్మ, వ్యవసాయశాఖ అధికారిని పిఎల్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పొగాకు వినియోగం హానికరం

ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవంపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి -కర్నూలు హాస్పిటల్

ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాదికారి డాక్టర్ శాంతి కళ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాదికారి కార్యాలయం నుండి కలెక్టరేట్ వరకు ఆశా కార్యకర్తలు కార్యాలయ సిబ్బందితో నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్య శాఖదికారి ప్రోగ్రాం అధికారులతో కలిసి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. డిఎంహెచ్ఓ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మే 31 వ తేదీన ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం జరుపుకొంటున్నామని తెలిపారు. కానీ ఆ పని అందులో భాగంగా ఈ సంవత్సరం "పొగాకు వినియోగంపై పరిశ్రమ ఉపయోగించే మోసపూరిత ప్రణాళికలను బహిర్గతం చేయడం " అను నినాదంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సరదాగా మొదలయ్యే ఈ అలవాటు తరువాత దురల వాటుగా మారి ప్రాణాలు తీస్తోందన్నారు పొగ త్రాగడం వలన క్యాన్సర్ ,పోగాకు ఉత్పతతుల సేవల వలన ప్రమాదకర వ్యాధులు వస్తాయని అన్నారు. పోగాకు సేవించడం ద్వారా నోటి దుర్వాసన, గొంతు వ్యాధులు, ఊపిరి తిత్తుల ఇన్ఫెక్షన్, కఫం, దగ్గు, ఆయాసం, రక్తపోటు, క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఇంట్లోని కుటుంబ సభ్యుల్లో ఒకరు తాగిన అది ఇంటిల్లిపాది ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోందని అన్నారు. సిగరెట్లు, పోగాకు ఉత్పత్తుల చట్టం ప్రకారం బస్ స్టాండ్, రైల్వే స్టేషన్, మార్కెట్, విద్యాసంస్థలు, సినిమా హాలు, ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజలు రద్దీగా ఉండే ప్రాంతాల్లో పొగత్రాగడం నిషేధం అని తెలిపారు. విద్యాసంస్థల పరిసరాల్లో వంద గజాలలోపు పొగాకు ఉత్పత్తులు విక్రయించడం, 18 సంవత్సరములలోపు వారికి పోగాకు ఉత్పత్తులు విక్రయించడం నిషేధం, దీనిని అతిక్రమించిన వారికి రూ.200 జరిమానాతో వారికి జైలు శిక్ష విధిస్తారని తెలిపారు. అనంతరం ఆశా కార్యకర్తలతో పోగాకు ఉత్పత్తుల వలన వచ్చు అనర్థాలను గురించి ప్రతిజ్ఞ చేయించారు.

జిల్లా అసంక్రామిత వ్యాధుల విభాగపు అధికారి డాక్టర్ శైలేష్ కుమార్, వివిధ విభాగపు అధికారులు డాక్టర్ నాగప్రసాద్, డాక్టర్‌రఘు. డాక్టర్ ఉమా, డాక్టర్ రామ శిరీష, డాక్టర్‌నిస్సిగ్రేస్, డెమో శ్రీనివాసులు శెట్టి , డిప్యూటీ డెమో చంద్రశేకర రెడ్డి ,డిపిఒ విజయరాజు, ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ సుధాకర్, ఎన్‌టిసిపి స్టాఫ్ సైకాలాజిస్ట్ చంద్రశేఖర్ , సోషల్ వర్కర్ సోమశేఖర్ స్వామి , డీసీఎం ప్రసాద్, హెచ్. ఈ పద్మావతి , కన్సల్టెంట్ మల్లికార్జున ,ఆశా కార్యకర్తలు , ప్రొజెక్షనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఓ డాక్టర్ శాంతికళ

నజీరుద్దీన్ సేవలు ఎనలేనివి...

నజీరుద్దీన్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపల్ కె.వెంకటరెడ్డి , అధ్యాపకులు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

అధ్యాపక వత్తిలో నజీరుద్దీన్ సేవలు ఎనలేనివని ప్రిన్సిపల్ వెంకటరెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. శనివారం కర్నూల్ కెవిఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో ఎకనామిక్స్ లెక్చరర్ డాక్టర్ ఎం నజీరుద్దీన్ ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె వెంకట్ రెడ్డి పత్తికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం మాధురి మాట్లాడారు. మూడు దశాబ్దాలకు పైగా అధ్యాపక వత్తిలో ఉండి విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో కృషి చేయడం అభినందనీయమన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం సమాజసేవలో అంకితం కావాలని ఆకాంక్షించారు. కళాశాల లెక్చరర్లు మహబూబ్‌బాషా ఎస్ఎం భాష తదితరులు పాల్గొన్నారు